

## మహిళల స్వప్నాన్ని చిదిమేశారు
- విపక్షాల తీరు భ్రూణహత్యతో సమానం
- నిప్పులు చెరిగిన మోదీ

02



## విపక్షాలు ఏకమై ప్రభుత్వాన్ని ఓడించాయి
- ప్రియాంకా గాంధీ

02



## అజరుద్దీన్ పదవిపై టెన్షన్
- గవర్నర్‌తో సీఎస్, ఏజీ భేటీ

02

Follow: @ANNTELUGU
19-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 112 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



**కంది రామచంద్రారెడ్డి**
*వీకెండ్ అనాలసిస్*

## బీజేపీకి గడ్డు పరిస్థితి మొదలైందా?

"కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. గాయం తగిలిన చోటే గెలుపు పాఠం మొదలవుతుంది. ఇపుడు ప్రతిపక్ష ఐక్యత మోదీషాకు 2014 తర్వాత తొలిసారి షాక్ ఇచ్చింది. ఈ షాక్ చిన్నది కాదు. మోదీషా ద్వయం అంటేనే అజేయమైన వ్యూహకర్తలు అనే ముద్ర ఉండేది. కానీ లోక్ సభలో ప్రత్యేక సమావేశం పెట్టి ప్రవేశపెట్టిన బిల్లుల పరిస్థితి చూస్తుంటే 'ఓవర్ కాన్ఫిడెన్స్' వారిని దెబ్బతీసిందా అన్న అనుమానం కలగక మానదు. బలాబలాలు అంచనా వేయడంలో మోదీ లెక్క ఎందుకు తప్పింది? బెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఈ ప్రత్యేక సమావేశం సలహా ఇచ్చింది ఎవరు? బీజేపీని బొక్కబోర్లా పడేలా చేసిన వ్యూహకర్తలు ఎవరు? ఈ తప్పు ఎవరిది? అవసరం లేని ఎత్తుగడ వేసి భంగపాటుకు గురైన మోదీ మరో వారం, పదిరోజుల్లో జరిగే ఎన్నికలముందు క్యాడర్ ఆత్మస్థైర్యం దెబ్బతినేలా వ్యవహరించారని చెప్పకతప్పదు. ఇపుడు లోక్ సభలో ఓడించాం.. బెంగాల్ లో ఓడిస్తాం.. తర్వాత ఢిల్లీలో దింపేస్తాం అంటూ మమతాబెనర్జీ హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అవకాశాలను బీజేపీ చేజేతులా అందించింది. బీజేపీ వ్యూహపదును తప్పిందా? అధికారం వ్యూహకర్తల తలకెక్కిందా? ఎంతో ఊరించి బిల్లు సభకు తీసుకొచ్చి.. బొక్కబోర్లా పడి నవ్వులపాలు కావడం విస్మయపరిచే అంశమే.


**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో

# చంద్రబాబు పరిస్థితి నితీష్, షిండే లాగే...
# బీజేపీని నమ్మితే అంతే

### సీఎం రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్.. బీజేపీ అహంకారం.. మిత్రపక్షాలకు ముప్పు

### మహిళా రిజర్వేషన్ల కోసం మా సీట్లు త్యాగం.. మెజార్టీ ఉందని ఏకపక్షంగా చట్టాలు చేస్తే కుదరదు



**ఢిల్లీ, మహా:** మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుపెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ అహంకారాన్ని ప్రదర్శిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీల మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్థకమేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లో మీడియాతో జరిగిన ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్ పలు సంచలన కామెంట్స్ చేశారు. మహిళా రిజర్వేషన్ల పట్ల తమకు పూర్తి చిత్తశుద్ధి ఉందని, అవసరమైతే ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే తమ సీట్లను త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహిళా బిల్లును సాకుగా చూపి నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో సీట్లు పెంచి, తద్వారా రాజ్యాంగాన్ని మార్చాలని చూడటం అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. లోక్‌సభలో ఈ బిల్లు వీగిపోవడం బీజేపీ దురుద్దేశాలకు దక్కిన చెంపపెట్టుగా ఆయన అభివర్ణించారు. సభను గంటసేపు వాయిదా వేసి చట్టాలను సవరించే సత్తా ఉన్న కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. సోమవారం నాడే సభను ప్రారంభించి మహిళలకు రిజర్వేషన్లు కల్పించే కొత్త చట్టాన్ని తీసుకురావాలని సవాలు విసిరారు. నియోజకవర్గాల పునర్విభజనతో పనిలేకుండా 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఈ ప్రక్రియను వెంటనే చేపట్టవచ్చని ఆయన సూచించారు.

**చంద్రబాబు పరిస్థితి నితీష్, షిండేల మాదిరే...**

కేంద్రంలో పూర్తిస్థాయి మెజార్టీ లేకపోవడం వల్లే బీజేపీ ప్రస్తుతం జాతీయ స్థాయిలో తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి విశ్లేషించారు.

మిగతా 2లో

## అన్నదాతలకు తీపికబురు..
- రేపు ఖాతాల్లోకి 'రైతుభరోసా' నిధులు
- కాటారం సభ వేదికగా నిధుల విడుదల
- రెండో విడతలో 45.11 లక్షల మంది రైతులకు లబ్ధి
- రూ.5,653 కోట్ల పెట్టుబడి సాయం

వివరాలు 2లో

# ఎన్డీఏకు స్వీట్ 16 షాక్

### వ్యతిరేకించిన 16 మంది ఎవరు?.. అనూహ్య చిక్కుముడి సంధించిన రాహుల్



**మహా:** పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన సందర్భంలో రాహుల్ గాంధీ చేసిన ఈ 16 అంకె వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 16మంది ఎన్డీఏ ఎంపీలు బిల్లులకు వ్యతిరేకంగా ఓటువేశారని, ఆ పజిల్ ఏంటో తనకూ చెప్పాలని రాహుల్ ఓ సంచలన అంశాన్ని ప్రజల్లోకి వదిలారు. ఏపీ లో టీడీపీ కి ఉన్నవి 16 ఎంపీ సీట్లు.. బిల్లులో ఎన్డీయే కు సొంతంగా ఉన్న బలం కంటే 16 ఓట్లు తక్కువగా రావడం..తెలంగాణ కాంగ్రెస్ సీఎంతో టీడీపీ ఎమ్మెల్యేలంతా కలిసి తిరగడంతో.. తెలుగురాష్ట్రాల్లో దీనిపై చర్చ జరుగుతుండగా, టీడీపీ కాకుంటే ఇంకెవరు ఇలా చేసి ఉంటారన్న చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆ చిక్కుముడి త్వరలో తెలుసుకుంటారని రాహుల్ పేల్చిన బాంబు తెలుగు స్టేట్స్ లో సంచలనంగా మారింది.

# వేసవి తర్వాతే జడ్పీ ఎన్నికలు

### బీఆర్ఎస్ అక్రమాల చిట్టా సిద్ధం.. మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికలు వేసవి కాలం ముగిసిన తర్వాతే జరిగే అవకాశం ఉందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, అలాగే రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచేందుకు కసరత్తు జరుగుతోందని ఆయన వెల్లడించారు. శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా (చిట్ చాట్) మాట్లాడిన మంత్రి.. రెవెన్యూ సంస్కరణలు, స్థానిక ఎన్నికలు, రాజకీయపరమైన అంశాలపై కీలక అప్‌డేట్స్ అందించారు.

**మంత్రివర్గ విస్తరణ.. నామినేటెడ్ పోస్టుల భర్తీ**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి స్పష్టత ఇచ్చారు.

మిగతా 2లో



## విపక్షాలు ఏకమై ప్రభుత్వాన్ని ఓడించాయి

**ప్రియాంకా గాంధీ**

**మహా:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. ఇది డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదన్నారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. ఎన్డీయేకు ఇది చీకటి రోజు అని, వారు తీసుకొచ్చిన బిల్లు తొలిసారిగా లోక్‌సభలో ఓడిపోయిందని విమర్శించారు.

## అజరుద్దీన్ పదవిపై టెన్షన్

**గవర్నర్ తో సీఎస్, ఏజీ భేటీ**

**హైదరాబాద్, మహా:** మంత్రి అజారుద్దీన్ అంశంపై లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సీఎస్ కె. రామకృష్ణరావు, ఏజీ సుదర్శన్ రెడ్డి భేటీ అయ్యారు. అజారుద్దీన్ అంశంపై ఇప్పటికే నాలుగు సార్లు గవర్నర్ కు విజ్ఞప్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం శనివారం మరోసారి విజ్ఞప్తిచేసింది. పెండింగ్ లో ఉన్న ఎమ్మెల్సీల అంశంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ నెలాఖరులోగా మంత్రి అజారుద్దిన్ గడువు ముగియనున్న నేపథ్యంలో పరిస్థితి ఉత్కంఠగా మారింది. ఎమ్మెల్సీల ఆమోదం లభించకపోతే, అజారుద్దీన్ తో రాజీనామా చేయించి తిరిగి ప్రమాణస్వీకారం చేయిస్తారా? లేక మరే వ్యూహం అవలంభిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



## 499/500 వచ్చినా అసంతృప్తే..

- ఆ ఒక్క మార్కు కోసం పట్టుబట్టిన విద్యార్థిని
- సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో కేరళకు చెందిన ఆషిమా అరుదైన ఘనత
- సైన్స్ లో 99 మార్కులు రావడంపై పెదవి విరుపు
- ఇవీ అసలైన టాపర్ల కష్టాలు' అంటూ నెట్టింట నెటిజన్ల ఫన్నీ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** సాధారణంగా బోర్డు పరీక్షల్లో 90 శాతం మార్కులు వస్తేనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పండుగ చేసుకుంటారు. స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకుంటారు. ఇక ఏకంగా 499 మార్కులు వస్తే వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ, కేరళకు చెందిన ఓ విద్యార్థిని మాత్రం తనకు 499/500 మార్కులు వచ్చినా ఏమాత్రం సంతృప్తి చెందలేదు. తగ్గిన ఆ ఒక్క మార్కును కూడా సాధించి, నూటికి నూరు శాతం పూర్తి స్కోరు (500/500) ఖాతాలో వేసుకోవాలనే పట్టుదలతో ఏకంగా రీవాల్యుయేషన్‌కు (పునర్మూల్యాంకనం) దరఖాస్తు చేసి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.

### సైన్స్ చేసిన ద్రోహం.. పట్టుబట్టిన ఆషిమా

ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో కేరళకు చెందిన ఆషిమా అనే విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఏకంగా 499 మార్కులు సాధించి సత్తా చాటింది. అయితే, అన్ని సబ్జెక్టుల్లోనూ నూటికి నూరు (100) మార్కులు సాధించిన ఆషిమాకు.. సైన్స్ సబ్జెక్టులో మాత్రం 99 మార్కులు మాత్రమే వచ్చాయి. తాను సైన్స్ పరీక్ష కూడా అద్భుతంగా రాశానని, అందులోనూ కచ్చితంగా పూర్తి మార్కులు రావాల్సిందేనని ఆమె బలంగా నమ్ముతోంది. మూల్యాంకనంలో ఎక్కడో చిన్న పొరపాటు జరిగి తనకు అన్యాయం జరిగిందని భావించిన ఆషిమా.. ఆ ఒక్క మార్కును తిరిగి పొందేందుకు రీవాల్యుయేషన్‌కు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎలాగైనా ఆ ఒక్క మార్కును తిరిగి సాధించి 500/500 రికార్డు సృష్టిస్తానని ఆమె అచంచలమైన విశ్వాసంతో చెబుతోంది.

### 'టాపర్ కష్టాలు ఇవే'.. నెట్టింట వైరల్

ఆషిమా సాధించిన స్కోరు, ఆమె తీసుకున్న నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా పాస్ మార్కుల కోసం, లేదా ఫెయిల్ అయిన సబ్జెక్టును గట్టెక్కించుకోవడం కోసం విద్యార్థులు దేవుళ్లకు మొక్కుకుంటూ రీవాల్యుయేషన్లు పెట్టుకోవడం చూస్తుంటాం. కానీ ఇలా 499 మార్కులు వచ్చి కూడా కేవలం ఒక్క మార్కు కోసం పోరాడటం నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది.

## మహిళల స్వప్నాన్ని చిదిమేశారు

**విపక్షాల తీరు భ్రూణహత్యతో సమానం.. నిప్పులు చెరిగిన మోదీ**



**ఢిల్లీ, మహా:** మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దేశంలోని సగం జనాభా ఆత్మాభిమానంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో విపక్షాల తీరుపై మోదీ నిప్పులు చెరిగారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు మహిళల స్వప్నాలను చిదిమేశాయని మండిపడ్డారు. ఈ చారిత్రక తప్పిదానికి దేశ మహిళా లోకానికి తాను క్షమాపణలు చెబుతున్నానని ప్రకటించిన ప్రధాని, రిజర్వేషన్లు అడ్డుకున్న వారిని మహిళలే కఠినంగా శిక్షిస్తారని హెచ్చరించారు. పార్లమెంటు వేదికగా మహిళా రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రతిపక్ష పార్టీలు ఏ విధంగా కుట్ర పన్నాయో యావత్ దేశం కళ్లారా చూసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీల స్వార్థ రాజకీయాలకు దేశంలోని మహిళా లోకం బలైపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నారీశక్తి ఎదుగుదలను అడ్డుకుని వారి కలలను ముక్కలు చేశారని దుయ్యబట్టారు. ఎంతో నిజాయితీతో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు ఘోరమైన పాపం చేశాయని, ఈ పాపానికి వారికి భవిష్యత్తులో తగిన శాస్తి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించలేకపోయినందుకు దేశ నారీమణులకు ఆయన బహిరంగంగా క్షమాపణలు తెలియజేశారు.

**సంబరాలా?.. ఇది భ్రూణహత్యతో సమానం!**

బిల్లును ఓడగొట్టిన ఆనందంలో విపక్షాలు చప్పట్లు కొడుతూ సంబరాలు చేసుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల ఆత్మాభిమానంపై దాడి చేసి సంతోషిస్తున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాల తీరును అక్షరాలా భ్రూణహత్యతో ఆయన పోల్చారు. తమకు జరిగిన ఈ ఘోర అన్యాయాన్ని దేశ మహిళలు ఎప్పటికీ మర్చిపోరని, రాబోయే రోజుల్లో వారే స్వయంగా ఈ పార్టీలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కుటుంబ వారసత్వ పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీలు మహిళలను ఎప్పటికీ రాజకీయంగా ఎదగనీయవని, 40 ఏళ్లుగా రిజర్వేషన్ల కోసం సాగుతున్న పోరాటాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేశాయని ఆయన విమర్శించారు. మహిళా బిల్లుకు మద్దతు ఇచ్చి క్రెడిట్ అంతా మీరే తీసుకోవాలని విపక్ష నేతలకు తాను స్వయంగా విజ్ఞప్తి చేసినప్పటికీ వారు పెడచెవిన పెట్టారని మోదీ గుర్తుచేశారు. తమకు ఎప్పుడూ దేశ ప్రయోజనాలే ముఖ్యమని, కానీ విపక్షాలకు మాత్రం దేశం కంటే రాజకీయాలే పరమావధి అని ఆయన దుయ్యబట్టారు.

**కాంగ్రెస్ ఒక పరాన్నజీవి.. డీలిమిటేషన్ కేవలం సాకే**

దేశంలో క్రమంగా సొంత ఉనికి కోల్పోతూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఒక పరాన్నజీవిలా మారిపోయిందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. తమ ఉనికిని కాపాడుకోవడం కోసం ఇతర ప్రాంతీయ పార్టీల భుజాల మీద ఆధారపడి మనుగడ సాగిస్తోందని విమర్శించారు. వాస్తవానికి డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారతదేశానికి లేదా ఏ ఇతర రాష్ట్రానికి అన్యాయం జరగదని, అన్ని రాష్ట్రాలకు సమాన హక్కులు దక్కేలా అత్యంత శాస్త్రీయంగా ఈ విధానాన్ని తీసుకువస్తున్నామని పదే పదే చెప్పినప్పటికీ ప్రతిపక్షాలు కావాలనే వినలేదన్నారు. దేశ ప్రజలను ప్రాంతాల వారీగా విభజించి రాజకీయ లబ్ధి పొందాలన్నదే కాంగ్రెస్ విచ్ఛిన్నకర ఆలోచన అని, ఆ కుట్రలో భాగంగానే డీలిమిటేషన్‌ను ఒక సాకుగా చూపిస్తూ మహిళా రిజర్వేషన్లను ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. మహిళల పట్ల దారుణంగా వ్యవహరించి, పార్లమెంటు వేదికగా నారీశక్తిని అవమానించిన ఈ ప్రతిపక్షాలకు దేశ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఉద్ఘాటించారు.

## చంద్రబాబు పరిస్థితి నితీష్, షిండే లాగే...

# బీజేపీని నమ్మితే అంతే

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో బీజేపీ సొంత బలం పెంచుకుంటే మాత్రం.. ఏమాత్రం సంకోచించకుండా టీడీపీని నిర్దాక్షిణ్యంగా పక్కనపెట్టడం ఖాయమని స్పష్టం చేశారు. ఇప్పటికే బిహార్‌లో నితీష్ కుమార్, మహారాష్ట్రలో ఏకనాథ్ షిండేల పరిస్థితిని చూస్తూనే ఉన్నామని, రాబోయే రోజుల్లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కూడా ఇదే గతి పడుతుందని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీతో జతకట్టిన ఏ ప్రాంతీయ పార్టీకీ దీర్ఘకాలంలో మనుగడ ఉండదన్న వాస్తవాన్ని గ్రహించాలని పరోక్షంగా హెచ్చరించారు.

**ఏకపక్షంగా చట్టాలు చేస్తే కుదరదు**

లోక్‌సభ, రాజ్యసభలు కేవలం చట్టాలు రూపొందించడానికే పరిమితమని, వాటిని క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పార్లమెంటులో మూడింట రెండొంతుల (2/3) మెజార్టీ ఉన్నంత మాత్రాన ప్రధాని స్థానంలో ఉన్న వ్యక్తి తానే రాజునని భావించి ఇష్టానుసారంగా చట్టాలు చేస్తే ఈ దేశంలో ఎవరూ అంగీకరించరని స్పష్టం చేశారు. ఇదే తర్కాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్వయించిన ఆయన.. అక్కడ ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లు మాత్రమే ఉన్నాయని, అంతమాత్రాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చెప్పిందే చట్టం అని ఏకపక్షంగా ముందుకెళ్తే ప్రజలు ఒప్పుకోరని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో డిక్టేటర్‌షిప్‌ను (నిరంకుశత్వాన్ని) ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

**చంద్రబాబు తప్పు చెప్పరు**

ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయాలు అనుభవంతో ఉంటాయని, ఆయన తప్పుగా చెప్పరని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జనాభా పెంపు నినాదం ఫలితాలు రావడానికి 3050 సంవత్సరాలు పట్టొచ్చని అన్నారు. మహాభారతంలో భీముడి అహంకారాన్ని హనుమంతుడు ఎలా అణిచివేసాడో, దేశ ప్రజలు కూడా అలాగే రాబోయే రోజుల్లో తీర్పు చెప్పబోతున్నారు. అహంకారం ఎవరికైనా పతనానికే దారి తీస్తుందన్నారు.

## బీజేపీ నిరంకుశత్వానికి చెంపపెట్టు

- ప్రజాస్వామ్యానిదే విజయం
- లోక్‌సభలో బిల్లు వీగిపోవడం 'ఇండియా' కూటమి ఘనతే
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మహా:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో నియంతృత్వానికి ఏమాత్రం తావులేదని లోక్‌సభ వేదికగా స్పష్టంగా నిరూపితమైందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సంఖ్యాబలం ఉందన్న అహంకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు వీగిపోవడం బీజేపీ నిరంకుశత్వానికి చెంపపెట్టు లాంటిదని ఆయన అభివర్ణించారు. చట్టాలను నిర్వీర్యం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చాలనే కుట్రలను తిప్పికొట్టిన 'ఇండియా' కూటమి ఎంపీలకు ఆయన హ్యాట్సాఫ్ చెప్పారు. లోక్‌సభలో రెండింట మూడొంతుల మెజారిటీకి 54 ఓట్లు తక్కువ రావడం ద్వారా బిల్లు వీగిపోవడంతో బీజేపీ పరిస్థితి చనిపోయిన శవంలా తయారైందని ఎద్దేవా చేశారు. డిలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ద్వారా దక్షిణ భారతదేశానికి తీవ్ర అన్యాయం జరిగేలా సీట్లు పెంచే కుట్రకు తెరలేపారని, దానికి మహిళా బిల్లును సైతం ఉద్దేశపూర్వకంగా ముడిపెట్టడం బీజేపీ కపట బుద్ధికి, రాజకీయ నిరంకుశత్వానికి నిదర్శనమని పొన్నం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీలిమిటేషన్‌పై కనీసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఎందుకు తీసుకోలేదని ఆయన నిలదీశారు. మహిళల సాధికారత గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి ఏమాత్రం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. గత 44 సంవత్సరాలుగా బీజేపీకి కనీసం ఒక్క మహిళా అధ్యక్షురాలు కూడా లేకపోవడం వారి పితృస్వామ్య భావజాలానికి అద్దం పడుతోందన్నారు. కానీ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన గుర్తుచేశారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ చొరవతో పంచాయతీరాజ్ చట్టం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చిన చరిత్ర తమ పార్టీ సొంతమన్నారు. దేశానికి తొలి మహిళా ప్రధాని, రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, పార్టీ అధ్యక్షురాలిని అందించిన కాంగ్రెస్ పార్టీయే అసలైన మహిళా పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ మేయర్ స్థానంలో ఒక మహిళ కూర్చున్నారంటే అది కాంగ్రెస్ పార్టీ చలవేనని ఆయన ఉదహరించారు. మహిళల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బీజేపీ, మహిళా బిల్లు పేరుతో పక్కదారి పట్టిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా బిల్లును వచ్చే ఎన్నికల్లోనే అమలు చేయాలని, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కచ్చితంగా సబ్ కోటా ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విధానమని ఆయన ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాల ఆకాంక్ష, ఎంతో మంది విద్యార్థులు, యువకుల బలిదానాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని, భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దుర్మార్గపు వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో అదే సభలో ఉన్న రాష్ట్ర బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణలకు కనీసం చీము, నెత్తురు లేదా అని ఆయన తీవ్ర పదజాలంతో ప్రశ్నించారు. కాకినాడ తీర్మానంలో 'ఒక ఓటు రెండు రాష్ట్రాలు' అని చెప్పి తెలంగాణ ఏర్పాటును జాప్యం చేసింది బీజేపీయేనని ఆయన విమర్శించారు. సీమాంధ్రులు వ్యతిరేకించినా, అద్వానీతో చర్చలు జరిపినా, ఎన్నో అడ్డంకులు ఎదురైనా సోనియా గాంధీ చిత్తశుద్ధితో ఆర్టికల్ 3 ద్వారా పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. ఆనాడు తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి, నేడు తమ ఎంపీ తప్పు చేశాడని ఒప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

# అన్నదాతలకు తీపికబురు..

- రేపు ఖాతాల్లోకి 'రైతుభరోసా' నిధులు
- కాటారం సభ వేదికగా నిధుల విడుదల
- రెండో విడతలో 45.11 లక్షల మంది రైతులకు లబ్ధి
- రూ.5,653 కోట్ల పెట్టుబడి సాయం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మరో తీపికబురు అందించింది. అన్నదాతలు సాగు పెట్టుబడి కోసం అప్పులపాలు కాకూడదనే ఉన్నత ఉద్దేశంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయాలని సర్కారు నిర్ణయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. కాటారం సభ వేదిక నుంచే ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను బదిలీ చేయనున్నారు. వానాకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్న తరుణంలో, సకాలంలో అందుతున్న ఈ ఆర్థిక సాయం వ్యవసాయ రంగంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపనుంది. రెండో విడత రైతు భరోసా పంపిణీ ద్వారా మెజారిటీ రైతులకు లబ్ధి చేకూరేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. తాజా సమాచారం ప్రకారం.. ఈ రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 45,11,947 మంది అర్హులైన అన్నదాతలకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం ఏకంగా రూ. 5,653 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్న రైతులను సైతం కవర్ చేస్తూ, ఎకరానికి రూ.6,000 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందజేయనున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలుకు మరియు దుక్కి దున్నే వ్యవసాయ పనులకు ఈ నిధులు ఎంతగానో వెసులుబాటు కల్పిస్తాయి. సమయానికి చేతికి డబ్బులు అందుతుండటంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన భారం తప్పుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు సంక్షేమమే ప్రథమ ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పటికే గత నెల మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడత రైతు భరోసా నిధులను విడుదల చేసిన విషయం విదితమే. ఆ రోజున ఒక ఎకరం లోపు ఉన్న రైతులను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.3,590 కోట్లను రైతుల ఖాతాల్లో విజయవంతంగా జమ చేసింది. ఇప్పుడు రెండో విడత నిధుల విడుదలతో ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను క్రమపద్ధతిలో నెరవేరుస్తున్నట్లు సర్కారు స్పష్టం చేస్తోంది. కేవలం ఈ రెండు విడతలతోనే ఆగిపోకుండా, సాంకేతిక కారణాల వల్ల ఇంకా సాయం అందని మిగిలిన అర్హులైన రైతులందరికీ మూడో విడతలో పెట్టుబడి సాయం అందించేందుకు సైతం ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసిందని, అందుకోసం నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని అధికార వర్గాలు ప్రకటించాయి. సర్కారు తీసుకుంటున్న ఈ వేగవంతమైన చర్యల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## వేసవి తర్వాతే జడ్పీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత పరిస్థితులు, రానున్న ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి తర్వాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు. ఇక రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారిన కేబినెట్ విస్తరణపై స్పందిస్తూ.. ఇది విడతల వారీగా జరుగుతుందని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉందన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేయలేదు. ఏ శాఖ కూడా ఎవరికీ శాశ్వతం కాదని, అయితే కీలక శాఖలపై ఆశలు పెట్టుకోవడం రాజకీయాల్లో సహజమేనని ఆయన వ్యాఖ్యానించారు. దీనితో పాటు పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సైతం త్వరలోనే చేపడతామని మంత్రి వెల్లడించారు.

**మ్యాప్‌తో రిజిస్ట్రేషన్లు.. భూ-భారతితో ధరణి సమస్యలకు చెక్**

తెలంగాణలో త్వరలోనే భూముల ప్రభుత్వ విలువలు పెరగనున్నాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ల్యాండ్ వాల్యూ పెంచలేదని, ప్రస్తుతం విలువల సవరణపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. రెవెన్యూ శాఖలో సరికొత్త విధానాన్ని తీసుకురాబోతున్నామని, వివాదాస్పద 'ధరణి' పోర్టల్ సమస్యలన్నింటినీ నూతనంగా తీసుకువస్తున్న 'భూభారతి' వ్యవస్థతో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నెల 20వ తేదీ నుంచి వినూత్నంగా మ్యాప్‌తో కూడిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో మొట్టమొదటి మ్యాప్ రిజిస్ట్రేషన్ పాలేరులో జరగనుందని ఆయన వెల్లడించారు. అసైన్డ్ భూములకు సంబంధించి అత్యధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిలో ప్రధానంగా నాలుగు రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి వివరించారు.

**బీఆర్ఎస్ అక్రమాల చిట్టా సిద్ధం.. సరైన సమయంలో బయటపెడతాం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై మంత్రి పొంగులేటి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమ పనుల జాబితాను ప్రస్తుతం సిద్ధం చేస్తున్నామని, సరైన సమయంలో వాటన్నింటినీ ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు తనపై మూకుమ్మడి దాడికి యత్నించినప్పుడు, తోటి మంత్రులు తనకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ప్రతిపక్షాల ట్రాప్‌లో తాను పడనని, వారు ఎంతగా విమర్శించినా అత్యంత ఓపికగా భరించి సముచితమైన రీతిలో సమాధానం ఇచ్చానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- ఏఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి
- వరంగల్, భద్రాచలం పోలీసు అధికారులకు కీలక బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన జరిగింది. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం తొమ్మిది మంది యువ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలన శాఖ (స్పెషల్‌బి) తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ మేరకు జీవో ఆర్టీ నంబర్ 491ని విడుదల చేశారు. ప్రధానంగా వివిధ జిల్లాల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) హోదాలో విధులు నిర్వర్తిస్తున్న 2022, 2023 బ్యాచ్‌లకు చెందిన యువ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ అదనపు ఎస్పీలుగా (అడ్మిన్) అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పగించడం ఈ బదిలీల్లో ప్రధానాంశంగా నిలిచింది. డీజీపీ కార్యాలయం నుంచి అందిన ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బదిలీ అయిన అధికారులందరూ తక్షణమే తమ పాత స్థానాల నుంచి రిలీవ్ అయి, కొత్త బాధ్యతలను స్వీకరించాలని సీఎస్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### పలు జిల్లాల పోలీసు యంత్రాంగంలో మార్పులు

పాలనాపరమైన అవసరాల దృష్ట్యా చేపట్టిన ఈ బదిలీల ప్రక్రియలో రాష్ట్రంలోని పలు కీలక జిల్లాల పోలీసు అధికారులకు స్థానచలనం ఏర్పడింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీగా ఉన్న 2022 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఎస్. చిత్తరంజన్‌ను అదే జిల్లాలో ఖాళీగా ఉన్న అదనపు ఎస్పీ (అడ్మిన్) పోస్టుకు బదిలీ చేశారు. అలాగే కామారెడ్డి ఏఎస్పీగా సేవలు అందిస్తున్న బొక్క చైతన్య రెడ్డిని సంగారెడ్డి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. ప్రస్తుతం సంగారెడ్డిలో ఉన్న సి.హెచ్. రఘునందన్ రావును బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో చైతన్య రెడ్డికి అవకాశం కల్పించారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీగా ఉన్న మహిళా ఐపీఎస్ అధికారిణి పి. మౌనికకు అదే జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. భైంసా అదనపు ఎస్పీగా, ఎస్డీపీఓగా ఉన్న రాజేష్ మీనాను వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. నిర్మల్ జిల్లా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాతిపాక సాయికిరణ్‌ను భైంసా ఏఎస్పీ/ఎస్డీపీఓగా నియమించారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏఎస్పీగా ఉన్న రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఏఎస్పీ/ఎస్డీపీఓగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులకు కీలక స్థానాలు

ఉత్తర తెలంగాణతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో పనిచేస్తున్న పలువురు చురుకైన యువ ఐపీఎస్ అధికారులకు ఈ బదిలీల్లో ప్రాధాన్యత దక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జనగామ ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పందేరే చేతన్ నితిన్‌ను జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. అలాగే వరంగల్ ఏఎస్పీగా ఉన్న మరో యువ ఐపీఎస్ అధికారి నగ్రాలె శుభమ్ ప్రకాష్‌ను నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అత్యంత ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఏఎస్పీగా పనిచేస్తున్న విక్రాంత్ కుమార్ సింగ్‌కు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్. మహేందర్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో విక్రాంత్ కుమార్ సింగ్‌ను నియమించారు. ప్రజలతో మమేకమవుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఈ యువ ఐపీఎస్‌లకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆయా జిల్లాల పోలీస్ శాఖలో మరింత జవాబుదారీతనం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. నేరాల నియంత్రణ, , పోలీసు యంత్రాంగాన్ని మరింత పారదర్శకంగా ముందుకు నడిపించే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులు చేపట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న ఈ యువ అధికారులు క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తారని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



## శ్రీకాళహస్తి భక్తులకు శుభవార్త..

- ఇకపై రూ.100కే రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు
- పేద భక్తుల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు కీలక నిర్ణయం
- పెరిగిన వెండి ధరల నేపథ్యంలో రూ.500 టికెట్ రద్దు
- ఆలయ అభివృద్ధి పనులకు సైతం పాలకమండలి గ్రీన్ సిగ్నల్

**శ్రీకాళహస్తి, మహా:** దక్షిణ కాశీగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం సామాన్య భక్తులకు ఒక శుభవార్తను అందించింది. ఎంతో విశిష్టమైన రాహుకేతు సర్పదోష నివారణ పూజలను పేదలకు మరింత చేరువ చేసేలా ఆలయ అధికారులు, పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం రూ. 100 కే ఈ సర్పదోష నివారణ పూజను చేసుకునే వెసులుబాటును కల్పించింది. అయితే, ప్రారంభ దశలో ఈ అవకాశాన్ని కేవలం తెల్ల రేషన్ కార్డు (దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు) ఉన్న పేద భక్తులకు మాత్రమే కల్పించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రతి బుధవారం సుమారు 2,000 మంది భక్తులకు ఈ రూ. 100 పూజ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు.


**పూజా టికెట్ల ధరల్లో భారీ మార్పులు**

శ్రీకాళహస్తిలో రాహుకేతు పూజలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే, ఈ పూజల టికెట్ల ధరల్లో ఆలయ బోర్డు కొన్ని మార్పులు చేసింది. ఇటీవల మార్కెట్‌లో వెండి ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో, ఇప్పటివరకు ఉన్న రూ. 500 పూజా టికెట్‌ను పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అలాగే అత్యున్నత శ్రేణిలో ఉన్న రూ. 5,000 టికెట్ ధరను రూ. 6,000 కు పెంచింది. అయితే సామాన్య, మధ్యతరగతి భక్తుల సౌకర్యార్థం మిగిలిన పూజా టికెట్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. రూ. 750, రూ. 1,500, రూ. 2,500 టికెట్ల పూజలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సామాన్యులకు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే పాత టికెట్లను యథాతథంగా కొనసాగిస్తూ, అదనంగా రూ.100 టికెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.

**ఆలయ అభివృద్ధి పనులకు ఆమోదం**

పూజా టికెట్లతో పాటు ఆలయంలో భక్తులకు మరింత ఆధ్యాత్మిక శోభను, మెరుగైన సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో పలు అభివృద్ధి పనులకు సైతం ట్రస్ట్ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా పానగల్ నుంచి రామసేతు వంతెన వరకు రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన పచ్చదనం (గ్రీనరీ) పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. అలాగే ఆలయ ఈవో మరియు ట్రస్టు బోర్డు సభ్యుల నివాసార్థం నూతనంగా క్వార్టర్స్ (వసతి గృహాలు) ఏర్పాటు చేసే ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలిపింది. రాబోయే రోజుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, భక్తులకు మౌలిక సదుపాయాలు పెంచే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు పాలకమండలి పేర్కొంది. ఆలయ దర్శన సమయాలు, ఈ పూజలకు సంబంధించిన పూర్తి వివరాలు తదితర సమాచారం కోసం భక్తులు శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారిక వెబ్‌సైట్ *srikalahasthitemple.org* ను సందర్శించాలని అధికారులు సూచించారు.

## మాజీ జెడ్పీటిసి దంపతులకు భూమి పూజకు ఆహ్వానం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటిసి కామిరెడ్డి శ్రీలత - రామకొండ రెడ్డి దంపతులకు ప్రత్యేక సత్కారం నిర్వహించారు.మణుగూరు ప్రాంతానికి చెందిన రెడ్డి సంఘ సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు, నూతనంగా నిర్మించనున్న రెడ్డీస్ కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానించేందుకు వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా దంపతులను శాలువాలతో సత్కరించి, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, అశోక్ రెడ్డి, గణేష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఎన్డీఆర్ఎఫ్ అవగాహన శిక్షణ కార్యక్రమం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మణుగూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, మణుగూరు మండల తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, మండలంలోని ఇతర అధికారులు, సిబ్బంది, అలాగే ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ అధికారులు విపత్తుల సమయంలో సమన్వయంతో పని చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.

### పరిసరాలు పరిశీలిస్తూ రోగుల సేవలు తెలుసుకుంటూ...

## సీహెచ్సీలో కాయకల్ప బృందం క్షేత్ర స్థాయి పరిశీలన



**నేలకొండపల్లి, మహా :** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను శనివారం కాయకల్ప బృందం పరిశీలించింది. వైద్య విధాన పరిషత్ అధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్. ప్రియదర్శిని ల బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యత ను పరిశీలించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ... ఎన్ని రకాల మందులు ఉన్నాయి. ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతటుంది. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుద్ధ్యం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను 'నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించి చర్చించారు. వైద్య సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చర్ల మండలంలో ఫైర్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి



**చర్ల మహా :** చర్ల మండలంలో ఫైర్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని బి ఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గారు ఫైర్ స్టేషన్ డిగ్రీ కళాశాల ఒద్దిపేట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు కాని కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చి 3 సంవత్సరాల అయిన హామీలు మర్చిపోయరు ఏప్రిల్ మే నెలలో తీవ్రంగా ఎండలు ఉంటాయాని చెప్తున్నారు అగ్ని ప్రమాదలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి ఫైర్ స్టేషన్ వెంటనే ఏర్పాటు చేసే అవకాశం లేకపోతే ఒక ఫైర్ ఇంజన్ అయినా ఏర్పాటు చేయండి అగ్ని ప్రమాదం జరినపుడు భద్రాచలం నుండి ఫైర్ ఇంజన్ దీనినే ప్రజలు గంటల కారు అంటారు వచ్చే సరికి ఇండ్లు ఇంట్లో సామాన్లు బూడదైపోతున్నాయి ఇళ్లు కాలిన వారికి ప్రభుత్వం ఏమి సహాయం చేయడం లేదు వెయ్యి 2 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటునారు ఇళ్లు కాలిన వారు మళ్ళీ మామూలుగా జీవితం గడపటానికి 2 మూడు సంవత్సరాలు పడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చి పోయి కాలక్షేపం చేస్తుంది మహిళలను కోటీశ్వరలను చేస్తామని చెప్పారు కోటీశ్వరలను సంగతి అలా ఉంచి ఒంటరి మహిళలకు వితంతువులు పెన్షన కోసం ఎదురుచూస్తున్నారు ప్రతి ఇంటిలో ఒక మహిళకు 2500 ఇస్తాము అని హామీ ఇచ్చారు వాటి కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు నిరుద్యోగులకు జీవనోపాధి కొరకు లోన్లు ఇస్తామని నిరుద్యోగ భృతి 3600 ఇస్తామని హామీ ఇచ్చారు నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు బ్రతుకుదెరువుకు ఎంటు వంటి అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైన ఇచ్చిన హామీలను అమలు చేయాలని చర్లకు వెంటనే ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయలని కోరుతున్నాను

## అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమం



**చర్ల మహా :** అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమం మరియు గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతల కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు, ఐటిడిఎ పిఓ శ్రీ రాహుల్ గారు... శనివారం నాడు దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమం మరియు గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతల కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటిడిఎ పిఓ శ్రీ రాహుల్ మాట్లాడుతూ మొబైల్, ఫాస్ట్ పుడ్లకు దూరంగా పిల్లలు అధికారులు సూచన చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను చేర్చడం అత్యంత అవసరమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గారు అన్నారు. దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామంలోని రైతు వేదికలో మరియు చర్ల మండలం త్యాగడ గ్రామపంచాయతీ రైతు వేదిక ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ మరియు పోషణ అభియాన్ పథకంలో చిరుధాన్యాల్లో విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండి పిల్లల ఎదుగుదలకు, రక్తవృద్ధికి, రోగనిరోధక శక్తి పెంపుకు ఎంతో సహాయపడతాయని తెలిపారు. చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక మరియు మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. జంక్ ఫుడ్స్కు దూరంగా ఉంచాలని, చిప్స్, కురుకురే వంటి పదార్థాల బదులు శనగలు, పప్పులు, పల్లీలు, పండ్లు వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్ వినియోగం తగ్గించి ఇంట్లో తయారు చేసిన సహజ ఆహారాన్ని మాత్రమే పిల్లలకు ఇవ్వాలని తెలిపారు. చిన్నారులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి, బయట ఆడుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.పిల్లలకు సమయానికి టీకాలు వేయించడం, తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం ద్వారా వారి మేధస్సు మరియు వ్యక్తిత్వ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.

ఈ సందర్భంగా ఐటిడిఏ పీవో బి. రాహుల్ గారు మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదని సూచించారు. గర్భిణీ స్త్రీలు లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయించడం చట్టవిరుద్ధమని, ప్రతి బిడ్డకు ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించి, బేటి బచావో బేటి పడావో కిట్లు పంపిణీ చేశారు. అలాగే అంగనవాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూవో స్వర్ణలత, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్, సిడిపిఓ జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, ఏపీఎం జగదీష్, మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ, సర్పంచులు మరియు వివిధ గ్రామాల మహిళలు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టానికి ఉరి వేస్తున్న మోదీ ప్రభుత్వం

### వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్



**సత్తుపల్లి, మహా:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉరి వేస్తూ కార్మికుల పొట్ట కొడుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సిద్ధారం, గౌరి గూడెం గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన పరిస్థితుల్లో మార్పు తెచ్చి రెండు పూటలా తిండి పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కూలీలు తింటున్న తిండి మెతుకులను గుంజుకున్నట్టు మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు విమర్శించారు. ఈకేవైసీ విధానం తేవడంతో పని ప్రదేశంలో ఇంటర్నెట్ సంకేతాలు అందక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేవైసీ లో దినసరి కూలి ఫోటో రాకపోతే ఆరోజు వేతనం తీసుకునే పరిస్థితి లేదని కూలీలకు ఇబ్బంది కలిగించే విధానాన్ని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ కూలీలు, పని ప్రదేశాల పర్యవేక్షకుల మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసిల్దార్ కార్యాలయంలో జరిగే ధర్నా కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, ప్రజా నాట్య మండలి డివిజన్ కార్యదర్శి అయినంపూడి సదానంద రావు, మంచాల వెంకటేశ్వరరావు, కొలిక పోగు కృష్ణ, జగపతిరావు, శిరోమణి, సిరికొండ నాగేశ్వరరావు, కాకటి యశోద, గద్దల దుర్గ, దాట్ల రాధమ్మ, గద్దల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వీడ్కోలు పార్టీ




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** శ్రీ రామచంద్ర ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ అధ్యక్షతన కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ విద్యా ప్రవీణ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు పార్టీ కార్యక్రమం శనివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రకరకాల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి పాటలు నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. అధ్యాపకులు విద్యార్థులకు భవిష్యత్తు గురించి విలువైన సూచనలు ఇచ్చి సమాజంలో మంచి స్థానం సంపాదించాలని ప్రేరణనిచ్చారు. విద్యార్థులు తమ కళాశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణ చంద్రరావు, డాక్టర్ కె.వనజ, పి.అనురాధ, డాక్టర్ ఏ.వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.మధు, అంజనీ దేవి, వెంకటరమణ, లక్ష్మీ నారాయణ, నవీన్, ఏఓ శివ జ్యోతి, ఆఫీసు సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితురాలికి 'నేస్తం' ట్రస్టు ఆర్థికసాయం



**బూర్గంపహాడ్ మహా :** భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీకి చెందిన గేదెల లక్ష్మి పక్షవాతంతో ఆరేళ్లుగా మంచాన పడి ఉందని, భర్త లక్ష్మినారాయణ మధుమేహంతో బాధపడుతున్నారని తెలుసుకుని మండల పరిధిలోని మోరంపల్లిబంజర్కు చెందిన 'నేస్తం చారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో శనివారం ఆమె నివాసానికి వెళ్లి ట్రస్టు బాధ్యులు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి మాట్లాడుతూ భర్తకు వచ్చే ఆసరా పింఛనుతోనే జీవనం సాగిస్తున్నారని స్థానికుల ద్వారా తమ దృష్టికి రావడంతో ట్రస్టు సభ్యులతో కలిసి ఈ ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. నిరుపేదలకు సహాయం చేయడంలో ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని, ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ చింతా అంకిరెడ్డి, గౌరవ సలహాదారులు బత్తుల రామకొండారెడ్డి, సభ్యులు కైపు రమేష్రెడ్డి, దుగ్గిరెడ్డి బాలనారాయణరెడ్డి, స్థానికులు రంగారావు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి



**బూర్గంపహాడ్ మహా :** జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరపతలపెట్టిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి శనివారం పిలుపునిచ్చారు. సారపాక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ వ్యవసాయ రంగాన్ని రక్షించడానికి కృషిచేస్తున్న అఖిల భారత కిసాన్ సభ అనుబంధంగా తెలంగాణ రైతుసంఘం పనిచేస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగానికి మద్దతుగా పోరాడుతున్నామని, బీజేపీ విధానాలు ఎండగట్టి వ్యవసాయ రంగాన్ని రక్షించడం కోసం 13 నెలలుగా మూడు నల్లచట్టాలపై రైతులు పోరాడి విజయం సాధించారన్నారు. ప్రస్తుత పోరాటం రైతు సమస్యలు పరిష్కరించాలని, స్వామినాధన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర పంటలకు బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై జిల్లా కేంద్రంలో జరిగే మహాసభలకు రైతులు పెద్దసంఖ్యలో హాజరై సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, | ఎస్ కె.అబిదా, పాండవుల రామనాథం, బయ్యా రాము, గుంటక కృష్ణ, కనకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సంత ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ..

## ఏరియా జిఎంకు సర్పంచ్, ప్రజాప్రతినిధుల వినతి...




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయబోయే సంత (అంగడి) కోసం సింగరేణి సంస్థ సహకారం అందించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ను సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్లు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. సంత ఏర్పాటుకు అవసరమైన ఓబి మట్టి, విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలని వారు కోరారు. గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తుందని ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మణుగూరు బ్రాంచ్ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, జీవరత్నం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏఎం చారీ, గుండ్ల వెంకటేశ్వర్లు, ఎస్ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా హిందూ సమ్మేళన ర్యాలీ..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో హిందూ సమ్మేళన ర్యాలీ శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. జెడ్పి ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన మోటార్ బైక్ ర్యాలీ టిడిపి సెంటర్ మీదుగా సురక్ష బస్టాండ్ వరకు సాగి తిరిగి జెడ్పి ఉన్నత పాఠశాలకు చేరుకుంది. భారీగా యువత, భక్తులు పాల్గొని పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమాజంలో ఐక్యత, ధార్మిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వల్లభనేని నాగేశ్వరరావు, పొన్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, భోగే చందర్, ముత్యాలరావు, డాక్టర్ దుస్సా సమ్మయ్య, పోశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీని జయప్రదం చేయండి

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి



**బూర్గంపహాడ్ మహా :** ఖమ్మం పట్టణంలో మమతా కళాశాల గ్రౌండ్స్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే బీఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి శనివారం పిలుపునిచ్చారు. పార్టీ ప్లీనరీ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావులు హాజరవుతున్నారని, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవానికి ముందుగా ఉమ్మడి జిల్లాలో ఈ పార్టీ ప్లీనరీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లీనరీని విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, | ప్రజాప్రతినిధులు, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సొసైటీ అధ్యక్షులు, సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, విద్యార్థి విభాగం, అనుబంధ సంఘాల బాధ్యులు, కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు

## నల్లబ్యాడ్జీలతో కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



**బూర్గంపహాడ్ మహా :** కార్మిక సమస్యలు తక్షణం పరిష్కరించాలని కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఐటీసీ కర్మాగారం | అడ్మిన్ బ్లాక్ వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలేదని, 14వ వేతన ఒప్పందం కార్మికులకు ఆమోదయోగ్యంగా రూ.22 వేలకు తగ్గకుండా చేయాలని, కార్మికులందరికీ 100శాతం అన్లిమిటెడ్ మెడికల్ స్కీంను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అడ్మిన్ బ్లాక్లో కార్మికులంతా నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని, షటిల్ కోర్టు, జిమ్ ఏసీ, బైక్ స్టాండ్, లాంగ్ సిక్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు తదితర సమస్యలు ఐటీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మిక జేఏసీ తీసుకునే వ్యతిరేక నిర్ణయాలకు గుర్తింపు సంఘం, యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రేగుల గండి చెరువులో స్నానం..

- విద్యార్థి గల్లంతు..
- సీఐ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు..
- మణుగూరులో విషాదం..



**మణుగూరు, మహా :** పాఠశాల ముగిసిన అనంతరం సరదాగా చెరువులో స్నానానికి దిగిన ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు గల్లంతైన విషాదకర ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థుల్లో పివీ కాలనీ ప్రాంతానికి చెందిన బొర్రా శశిధర్ (14), అశ్వాపురం మండలం కు చెందిన పేరూరి గిరిధర్ (14), మణుగూరు పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన హర్షవర్ధన్ (14) ముగ్గురు విద్యార్థులు శనివారం రేగుల గండి చెరువుకు వెళ్లి స్నానానికి దిగారు. ఈ క్రమంలో హర్షవర్ధన్ అకస్మాత్తుగా నీటిలో కనిపించకుండా పోయాడు. తోటి విద్యార్థులు వెంటనే స్థానికులకు సమాచారం ఇవ్వగా, విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సీఐ నాగబాబు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ప్రారంభించారు. చెరువులో నీటి లోతు ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టతరంగా మారినట్లు సమాచారం. హర్షవర్ధన్ గల్లంతుతో కుటుంబ సభ్యులు ఆందోళనలో మునిగిపోయారు. ఈ ఘటనతో ఆదర్శనగర్ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

## తుమ్మలకుంట చెరువును లూటీ చేసిన గ్రామస్తులు

### తుమ్మలకుంట చెరువు వద్ద ఉద్రిక్తత

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం దుబ్బతండా మత్స్యకార సొసైటీ వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. శనివారం దుబ్బతండాకు చెందిన వ్యక్తులు తుమ్మలకుంట చెరువును లూటి చేశారు. చెరువులో ఉన్న చేపలను ఎత్తుకెళ్ళారు. దీంతో కుంటలో ఉన్న పట్టాదారులు పోలీసులకు పిర్యాదు చేశారు. దుబ్బతండా గ్రామపంచాయతీలోని తుమ్మలకుంట మత్స్యసొసైటీ కొంతకాలంగా వివాదస్పదంగా ఉంది. 2011 సంవత్సరం నుండి కొనసాగుతున్న ఈ మత్స్యకార సొసైటీపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పట్టా భూములు, దేవదాయ భూములు ఉన్న చెరువులను సొసైటీ చేయకూడదని నిబంధన ఉన్నా మత్స్యశాఖ అధికారులు సొసైటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చి దాని నిర్వాహణ అడ్డు చెప్పటంలేదని చెరువు మునకలో ఉన్న పట్టాదారులు ఆరోపిస్తున్నారు. అధికారుల తప్పిదంతోనే సొసైటీ ఏర్పడడం జరిగిందని దానికి బాధ్యులైన పట్టాదారులు కారేపల్లి పోలీస్ స్టేషన్ సైతం కేసులు పెట్టారు. వివాదం నడుస్తుండగా తుమ్మలకుంట చెరువులోకి గ్రామస్తులు దూరి చేపల వేట చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు పోలీసులకు పిర్యాదు చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

### మంచినీటి సమస్యల పరిష్కారానికి

## సింగరేణి ముందడుగు..

### సిఐటియు విన్నపంపై స్పందించిన యాజమాన్యం..



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలో నెలకొన్న మంచినీటి సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డిలు తెలిపారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా యూనియన్ నాయకులు మణుగూరు ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న వాటర్ సప్లై జిఎల్ సంప్, ఆర్.జి.ఎఫ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ, నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న పలు సాంకేతిక, నిర్వహణ లోపాలను గుర్తించారు. ఈ సమస్యల వల్ల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే ఏరియా జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. యూనియన్ విన్నపంపై స్పందించిన యాజమాన్యం సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. సమస్యలను గుర్తించిన వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు ప్రారంభించినందుకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున ఏరియా జిఎం, డిజిఎం(సివిల్)లకు నాయకులు మంద నరసింహారావు, తుమ్మల రాజిరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

# మోదీ లెక్క ఎందుకు తప్పింది?

**ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన వృక్షమైనా.. గాలివాటం మారితే నేలకొరగక తప్పదు. రాజకీయంలో 'అజేయుడు' అనే పదానికి కాలం చెల్లిందని తాజా లోక్ సభ పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఏనుగు ఏడు అడుగులు వెనక్కి వేసిందంటే అది భయపడి కాదు.. దూకడానికి సిద్ధమవుతుందని అర్థం. కానీ, అదే ఏనుగు ఊబిలో కాలు వేస్తే? ఇప్పుడు మోదీ-షా ద్వయం పరిస్థితి అలాగే కనిపిస్తోంది." రాజకీయం అంటేనే చదరంగం. ఇక్కడ ఎత్తులు పారుతాయి.. పొత్తులు కుదురుతాయి. కానీ, ఎప్పుడూ అజేయులుగా భావించే మోదీ-షా ద్వయం వేసిన "స్పెషల్ సెషన్" ఎత్తుగడ చివరకు సెల్ఫ్ గోల్ లా మారింది. 2014 తర్వాత తిరుగులేని ఆధిపత్యంతో దూసుకుపోతున్న బీజేపీకి, లోక్ సభలో ఎదురైన ఈ పరిణామం ఒక హెచ్చరిక. గాయం తగిలిన చోటే గెలుపు పాఠం మొదలవుతుంది అంటారు.. మరి ఈ గాయం నుంచి బీజేపీ పాఠం నేర్చుకుంటుందా? లేక పతనం మొదలవుతుందా? చాణక్యం చెదిరిందా? మోదీ మార్క్ 'మేజిక్' రివర్స్ అయిందా? - కంది రామచంద్రారెడ్డి, సీఈవో, ఏఎన్ఎన్ & మహాపత్రిక వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ప్రతిపక్ష ఐక్యత మోదీషాకు 2014 తర్వాత తొలిసారి షాక్ ఇచ్చింది. ఈ షాక్ చిన్నది కాదు. మోదీషా ద్వయం అంటేనే అజేయమైన వ్యూహకర్తలు అనే ముద్ర ఉండేది. కానీ లోక్ సభలో ప్రత్యేక సమావేశం పెట్టి ప్రవేశపెట్టిన బిల్లుల పరిస్థితి చూస్తుంటే 'ఓవర్ కాన్ఫిడెన్స్' వారిని దెబ్బ తీసిందా అన్న అనుమానం కలగక మానదు. బలాబలాలు అంచనా వేయడంలో మోదీ లెక్క ఎందుకు తప్పింది? బెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఈ ప్రత్యేక సమావేశం సలహా ఇచ్చింది ఎవరు? బీజేపీని బొక్కబోర్లా పడేలా చేసిన వ్యూహకర్తలు ఎవరు? ఈ తప్పు ఎవరిది? అవసరం లేని ఎత్తుగడ వేసి భంగపాటుకు గురైన మోదీ మరో వారం, పదిరోజుల్లో జరిగే ఎన్నికలముందు క్యాడర్ ఆత్మస్థైర్యం దెబ్బతినేలా వ్యవహరించారని చెప్పకతప్పదు. ఇపుడు లోక్ సభలో ఓడించాం.. బెంగాల్ లో ఓడిస్తాం.. తర్వాత ఢిల్లీలో దింపేస్తాం అంటూ మమతాబెనర్జీ హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అవకాశాలను బీజేపీ చేజేతులా అందించింది. బీజేపీ వ్యూహపదును తప్పిందా? అధికారం వ్యూహకర్తల తలకెక్కిందా? ఎంతో ఊరించి బిల్లు సభకు తీసుకొచ్చి.. బొక్కబోర్లా పడి నవ్వులపాలు కావడం విస్మయపరిచే అంశమే.





### అతి విశ్వాసమే శాపమా?

మోదీ లెక్క ఎక్కడ తప్పింది? అసెంబ్లీ ఎన్నికల ముంగిట అనవసరమైన హడావుడితో ప్రత్యేక సమావేశం నిర్వహించడం, అందులో కీలక బిల్లులు వీగిపోవడం భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం. ఒకప్పుడు అమిత్ షా వ్యూహం అంటే ప్రత్యర్థులకు వణుకు. కానీ ఇప్పుడు రాహుల్, ప్రియాంక, మమతా బెనర్జీ, స్టాలిన్ వంటి నేతలు ఆ వ్యూహాలను చిత్తు చేస్తున్నారు. అసలు ఎన్నికల ముందు ఈ సాహసం చేయమని సలహా ఇచ్చింది ఎవరు? బలాబలాలు అంచనా వేయడంలో గ్రౌండ్ రిపోర్ట్స్ ఎందుకు తప్పులతడకయ్యాయి? 1970వ దశకంలో ఇందిరా గాంధీ కూడా ఇలాగే తిరుగులేని శక్తిగా ఎదిగారు. కానీ 'అతి విశ్వాసం' ఆమెను అత్యవసర పరిస్థితి వైపు నడిపించింది. నేడు మోదీ విషయంలో కూడా అలాంటి 'అధికార గర్వం' వ్యూహకర్తల తలకెక్కిందా అనిపిస్తోంది. "లోక్ సభలో ఓడించాం.. బెంగాల్ లో ఓడిస్తాం.. ఢిల్లీలో దింపేస్తాం" అన్న మమతా బెనర్జీ మాటలు ఇప్పుడు బీజేపీ క్యాడర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఎన్నికలకు వారం రోజుల ముందు ఇలాంటి భంగపాటు బీజేపీకి కోలుకోలేని దెబ్బ. వ్యూహకర్తలు మేల్కొకపోతే, అజేయమైన మోదీషా ద్వయం చరిత్రకే పరిమితం కావాల్సి వస్తుంది.

### 'ఇండి' కూటమి రాటుదేలిందా?

గతంలో విడివిడిగా ఉన్న ప్రతిపక్షాలు ఇప్పుడు ఒకే తాటిపైకి రావడం మోదీకి అతిపెద్ద సవాలుగా మారింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు వీరిద్దరూ ఏకమై కేంద్రాన్ని ఢీకొనడం బీజేపీకి గడ్డు పరిస్థితిని కల్పిస్తోంది. చారిత్రాత్మక బిల్లు అంటూ ప్రచారం చేసుకున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పుడు డీలిమిటేషన్ అనే సందిగ్ధంలో పడింది. అసలు ఈ బిల్లు అమలులోకి వస్తుందా? లేక కేవలం ఎన్నికల గిమ్మిక్కుగానే మిగిలిపోతుందా? అని మహిళా లోకం ప్రశ్నిస్తోంది. 50 శాతం పెంపుపై ఎన్డీఏ కూటమిలో ఏకాభిప్రాయం లేకపోవడం కూడా బీజేపీకి ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తోంది.

### దక్షిణాది రాజకీయం: రేవంత్ దూకుడు

దక్షిణాదిలో రేవంత్ రెడ్డి దూకుడు 'ఇండి' కూటమికి కొత్త ఊపిరి పోస్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పుంజుకోవడం బీజేపీ, బీఆర్ఎస్ లకు ఆందోళన కలిగిస్తోంది. సౌత్ కు అన్యాయం జరుగుతున్నదంటూ సౌత్ సీఎంలు అందరికీ లేఖలు రాయడం, కొత్త అజెండాను ప్రతిపాదించడం జాతీయస్థాయిలో ఎన్డీఏ వ్యతిరేక వాతావరణాన్ని క్రియేట్ చేశాయి.

### జగిత్యాల సభతో కేసీఆర్ ఎంట్రీ

కేసీఆర్ జగిత్యాల సభ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పనుంది. కేసీఆర్ సభ రోజే రేవంత్ కాళేశ్వరం మేడిగడ్డకు వెళ్ళడం ప్రభావాన్ని తగ్గించే వ్యూహం. రాజకీయాల్లో వ్యూహాలు ప్రతివ్యూహాలు ఉంటాయి. మరోవైపు కవిత కొత్త రాజకీయ పార్టీ అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కవిత కొత్త పార్టీ ఏ పార్టీ ఓట్లను చీలుస్తుంది? అది అంతిమంగా కాంగ్రెస్ కి లాభమా లేక బీజేపీకా? అన్నది రానున్నరోజుల్లో జరిగే వలసలు, చేరికలు, ఎజెండా, కార్యాచరణ ఆధారంగా ఉండనుంది.

### బీజేపీకి గడ్డు పరిస్థితి మొదలైందా?

అవసరం లేని ఎత్తుగడ వేసి భంగపాటుకు గురైన మోదీ, ఎన్నికల ముందు క్యాడర్ ఆత్మస్థైర్యం దెబ్బ తినేలా వ్యవహరించారనడంలో సందేహం లేదు. రాబోయే వారం రోజులు బీజేపీకి అత్యంత కీలకం. డ్యామేజ్ కంట్రోల్ చేయకపోతే, 2026 అసెంబ్లీ ఎన్నికలు 2029 లోక్ సభ ఎన్నికలకు ఒక ట్రైలర్ లా మారే అవకాశం ఉంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# అవగాహనతోనే వడదెబ్బ నివారణ సాధ్యం



ఎండాకాలం ప్రారంభమవుతూనే ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపే ప్రధాన సమస్యల్లో వడదెబ్బ (సన్ స్ట్రోక్) ఒకటి. ప్రతి సంవత్సరం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ వడదెబ్బ బారిన పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, శారీరక శ్రమ ఎక్కువగా చేసే కార్మికులు, రైతులు, రోడ్లపై పనిచేసే ఉద్యోగులు అధిక ప్రమాదంలో ఉంటారు. సరైన అవగాహన, తగిన జాగ్రత్తలు ఉంటే వడదెబ్బను పూర్తిగా నివారించవచ్చు.

వడదెబ్బ అనేది సాధారణ అలసట కాదు. అధిక ఉష్ణోగ్రతలకు శరీరం తట్టుకోలేకపోవడం వల్ల శరీర ఉష్ణ నియంత్రణ వ్యవస్థ దెబ్బతిని ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కి పైగా పెరగడం, చెమట ఆగిపోవడం, శరీరం వేడెక్కిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది ప్రాణాంతక పరిస్థితికి కూడా దారితీయవచ్చు.

వడదెబ్బ వచ్చినప్పుడు ముందుగా కనిపించే లక్షణాలు తల తిరగడం, తీవ్రమైన తలనొప్పి, బలహీనత, అలసట, వికారం, వాంతులు. కొందరిలో చర్మం ఎర్రబడిపోవడం, శరీరం వేడెక్కిపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, గందరగోళం, స్పృహ తప్పడం వంటి సమస్యలు కనిపిస్తాయి. తీవ్రమైన పరిస్థితుల్లో మూర్ఛలు కూడా రావచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణ వైద్య సహాయం తీసుకోవాలి.

ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు గతంతో పోలిస్తే మరింత పెరిగాయి. ఉదయం నుంచే మండే ఎండలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు సూర్యకిరణాలు అత్యంత తీవ్రంగా ఉంటాయి. ఈ సమయంలో బయటకు వెళ్లడం సాధ్యమైనంత వరకు తగ్గించాలి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయట పనులు వాయిదా వేసుకోవడం మంచిది.


నీటి కొరత వడదెబ్బకు ప్రధాన కారణాల్లో ఒకటి. చాలా మంది దాహం వేసిన తర్వాత మాత్రమే నీరు తాగుతారు. ఇది సరైన పద్ధతి కాదు. దాహం వేయకపోయినా ప్రతి గంటకు కొంత నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. సాధారణ నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటి ద్రవాలు శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు ఉప్పు, ఖనిజాల సమతుల్యతను కాపాడుతాయి.

దుస్తుల విషయంలో కూడా జాగ్రత్తలు అవసరం. ఎండాకాలంలో బిగుతైన, మందమైన దుస్తుల కంటే తేలికపాటి, వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించడం ఉత్తమం. తెలుపు లేదా లేత రంగుల దుస్తులు వేడిని తక్కువగా ఆకర్షిస్తాయి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, తలకు టవల్, సన్ గ్లాసెస్ వంటి రక్షణ సాధనాలు తప్పనిసరిగా వాడాలి.

ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు అవసరం. కారం, మసాలా, వేపుళ్లు అధికంగా ఉండే ఆహారం శరీరంలో వేడిని పెంచుతుంది. అందువల్ల దోసకాయ, టమాటా, పుచ్చకాయ, ముసంబి, బత్తాయి, పెరుగు, మజ్జిగ వంటి చల్లదనాన్ని ఇచ్చే పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. శరీరానికి తగినంత పోషకాలు అందేలా తేలికపాటి, సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది.

ఎండలో ఎక్కువసేపు ప్రయాణాలు చేయడం కూడా ప్రమాదకరం. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ప్రయాణ సమయంలో తగినన్ని నీళ్లు వెంట ఉంచుకోవాలి. వాహనాల్లో చిన్నపిల్లలను ఒంటరిగా వదిలేయడం అత్యంత ప్రమాదకరం. కొద్ది నిమిషాల్లోనే తీవ్రమైన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది.

చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వర్గాలు. చిన్నపిల్లల శరీర ఉష్ణ నియంత్రణ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం, వృద్ధుల్లో శారీరక నిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల వీరు త్వరగా వడదెబ్బకు గురవుతారు. 65 సంవత్సరాలు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎండలో తిరగకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స అందించడం అత్యంత కీలకం. బాధితుడిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి లేదా ఫ్యాన్, ఏసీ ఉన్న చల్లని గదికి తీసుకెళ్లాలి. శరీరాన్ని చల్లటి నీటితో తడపాలి లేదా తడి గుడ్డతో ఒళ్లు తుడవాలి. స్పృహలో ఉంటే మజ్జిగ, ORS ద్రావణం, చల్లటి నీరు తాగించాలి. అయితే పరిస్థితి తీవ్రమైతే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తరలించాలి. ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడటం ప్రమాదకరం. వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే మూత్రపిండాలు, మెదడు, గుండె వంటి ముఖ్య అవయవాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. అందుకే ఇది చిన్న సమస్యగా కాకుండా అత్యవసర ఆరోగ్య సమస్యగా చూడాలి. ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ, స్థానిక సంస్థలు కలిసి గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా కూలీలు, రైతులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలి. ప్రజలు కూడా తమ ఆరోగ్యంపై బాధ్యతతో వ్యవహరించాలి. వడదెబ్బ అనేది నివారించలేని సమస్య కాదు. చిన్న చిన్న జాగ్రత్తలు, సరైన జీవనశైలి, ముందస్తు అప్రమత్తతతో దీన్ని పూర్తిగా నియంత్రించవచ్చు. ఎండను తక్కువ అంచనా వేయకుండా, ఆరోగ్యాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటేనే సురక్షితమైన వేసవిని గడపగలం. అవగాహనతోనే వడదెబ్బ నివారణ సాధ్యమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.



- డాక్టర్ ఎం. రాజీవ్
టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ విభాగం రాష్ట్ర చైర్మన్

# కాల్పుల విరమణతో ఉపశమనం



అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్, లెబనాన్ మధ్య ఎట్టకేలకు కాల్పుల విరమణ జరిగింది. అమెరికా, ఇరాన్ కాల్పుల విరమణ చేసినా ఇజ్రాయెల్ చేయక పోవడంతో, పైహెచ్చు లెబనాన్ పై విరుచుకు పడడంతో కలవరం కలిగింది. ఇజ్రాయెల్ దాడిలో లేబనాన్ తీవ్రంగా నష్టపోయింది మంచి మంచి కట్టడాలు నేల కులాయి. లేబనాన్ లో హెజ్బుల్లా ఒక్కటే ఇజ్రాయెల్ పై దాడి చేసింది. హెజ్బుల్లా లేకపోయి ఉంటే ప్రపంచ చిత్ర పటంలో లేబనాన్ ఉండేది కాదు. లేబనాన్ ప్రధానం గా వ్యవసాయక దేశం. అక్కడ మతాల మధ్య సంఘీభావం ఉంది. ప్రజలలో క్రైస్తవం, ఇస్లాం వారు ఉన్నారు.అయితే అరబిక్ భాష మాట్లాడతారు. వాళ్ళు వాడే కరెన్సీ పౌండ్.పండ్లు, కూరగాయలు ప్రధాన ఎగుమతులు. లోహాలు, యంత్ర సామాగ్రి దిగుమతులు. ఇజ్రాయెల్ తో వచ్చిన యుద్ధం వల్ల పండ్లు, వ్యవసాయం దెబ్బతింది.యుద్ధం వల్ల దిగుమతులు అంతగా లేవు. ఇరాన్ అండ ఉండడం వల్ల కొంచెమైనా ఇజ్రాయెల్ తో ప్రతిఘటించింది. ఇజ్రాయెల్ కూడా అక్కడ క్రైస్తవ మతస్తులు గురించి ఆందోళన చెందింది. అమెరికా ఇరాన్ తో కాల్పులు విరమించిన ఇజ్రాయెల్ మాత్రం లేబనాన్ పై దాడులు కొనసాగించింది. ఇక్కడే ఇరాన్ మతలబు పెట్టింది. హార్ముజ్ జల సంధి మూసివేస్తే ఇజ్రాయెల్ దారికి వస్తుందని తెలిసి ఆ ప్రయత్నం ముమ్మరం చేసింది. ఇజ్రాయెల్ నౌకలు అక్కడ చిక్కుకుని ఇబ్బందులు పడ్డాయి. కేవలం ఇజ్రాయెల్ కాక అమెరికా నౌకలు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డాయి.పశ్చిమ ఆసియా సంక్షోభం పై దౌత్యం నెరపెందుకు పారిస్ లో యాభై దేశాధి నేతలు శుక్రవారం సమావేశం అయ్యారు. అయితే యుద్ధం ముగించాలని పాక్ దౌ త్యం విఫలమైంది. మళ్ళీ చర్చలు వుంటాయని ట్రంప్ ప్రకటించాడు కాని పాక్ లో చర్చలు ఉండవు. ఎందుకంటె పాక్లో ఆర్థిక సంక్షోభం వలన పాక్ తల ఊపింది కాని పాక్ సైన్యధ్యక్షుడు మునీర్ ఇరాన్ వెళ్ళి ఆ దేశ నేతలతో చర్చలు చేశాడు. దాని ఫలితమే హార్మోజ్ జల సంధి ఇరాన్ తెరుస్తున్నట్లు ప్రకటించింది జల సంధి తెరవటం వల్ల భారత్ కు భారీ ఊరట లభించింది. ట్రంప్ ను మేము ఎప్పటికి నమ్మనే నమ్మం అని ఇరాన్ ప్రకటించడం లో ఆంతర్యం ఏమిటంటే యురేనియం నిల్వలు మేము అప్పగించినట్లు ట్రంప్ అబద్ధం అడారని ఇరాన్ మండిపడింది. అసలు ఆ అంశం చర్చకు రానే రాలేదు అని ఇరాన్ స్పీకర్ చెప్పినట్లు భోగట్ట.లేబనాన్ లో వున్న హెజ్బుల్లా ను నాశనం చేసేంతవరకు యుద్ధం విరమణ ప్రసక్తే లేదని నేతన్యాహూ చెప్పడం చూసి ట్రంప్ బరిలోకి దిగి మొత్తానికి ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పది రోజుల కాల్పుల విరమణ కుదిరిందని ట్రంప్ చెప్పడం గమనార్హం.ఏతా వాత హార్ముజ్ జల సంధి ఇరాన్ కట్టడి చేయడంతో అమెరికా సైనికులు ఆకలి తో అలమటించారు. అందుకే ఇరాన్ వైపు ట్రంప్ మొగ్గినట్లు కనిపిస్తోంది.ఇరాన్ అండ పుష్కలంగా వున్న లేబనాన్ లోని హెజ్బుల్లా మిలిటెంట్ గ్రూప్ ను పూర్తిగా తుడిచి వేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహూ స్పష్టం చేశాడు. అందుకు అనుగుణం గానే ఇజ్రాయెల్ దాడి వలన రెండు వేల మందికి పైగా లేబనాన్ ప్రజలు మరణించారు. దాదాపు పది లక్షల మందికి పైగా సర్వం కోల్పోయారు. అది తెలిసే ట్రంప్, ఇజ్రాయెల్ కు గట్టి హెచ్చరిక చేసినట్లు వినికిడి. అందుకే ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఆపింది.ఫలితంగా ఇరాన్ హార్ముజ్ జల సందిని తెరచినట్లు ప్రకటించింది. ఇక నౌకలు స్వేచ్ఛగా వెళ్ళవచ్చని ప్రకటన గుప్పించింది. దీనితో చమురు ధరలు పడిపోయాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ప్రకటించింది కాని దీన్ని శాశ్వతంగా చేయాలని లేబనాన్ ప్రకటించింది.లేబనాన్ పై కాల్పులు జరిగితే వై దో లుగుతామని ఇరాన్ చెప్పడంతో. ఎట్టకేలకు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటించింది. దీనితో లేబనాన్ లో పౌరులు హర్షం ప్రకటించారు.మొత్తానికి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణతో ఉపశమనం కల్పించారు. ఇది శాశ్వతంగా ఉండాలని కోరుకుందాం.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

# తుమ్మలకుంట చెరువును లూటీ చేసిన గ్రామస్తులు

**తుమ్మలకుంట చెరువు వద్ద ఉద్రిక్తత**



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం దుబ్బతండా మత్స్యకార సొసైటీ వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. శనివారం దుబ్బతండాకు చెందిన వ్యక్తులు తుమ్మలకుంట చెరువును లూటి చేశారు. చెరువులో ఉన్న చేపలను ఎత్తుకెళ్ళారు. దీంతో కుంటలో ఉన్న పట్టాదారులు పోలీసులకు పిర్యాదు చేశారు. దుబ్బతండా గ్రామపంచాయతీలోని తుమ్మలకుంట మత్స్యసొసైటీ కొంతకాలంగా వివాదస్పదంగా ఉంది. 2011 సంవత్సరం నుండి కొనసాగుతున్న ఈ మత్స్యకార సొసైటీపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పట్టా భూములు, దేవదాయ భూములు ఉన్న చెరువులను సోసైటీ చేయకూడదని నిబంధన ఉన్నా మత్స్యశాఖ అధికారులు సోసైటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చి దాని నిర్వాహణ అడ్డు చెప్పటంలేదని చెరువు మునకలో ఉన్న పట్టాదారులు ఆరోపిస్తున్నారు. అధికారుల తప్పిదంతోనే సొసైటీ ఏర్పడడం జరిగిందని దానికి బాధ్యులైన పట్టాదారులు కారేపల్లి పోలీస్ స్టేషన్ సైతం కేసులు పెట్టారు. వివాదం నడుస్తుండగా తుమ్మలకుంట చెరువులోకి గ్రామస్తులు దూరి చేపల వేట చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు పోలీసులకు పిర్యాదు చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, సోసైటీ సభ్యులు కోరుతున్నారు.

# ఐకేపీ వీవోఏలకు ఉద్యోగభద్రత కల్పించాలి

**కారేపల్లి మండల వీవోఏ కార్యవర్గం ఎన్నిక**

**కారేపల్లి, మహా :** సెర్ప్ ఇందిరాక్రాంతి పథంలో పని చేస్తున్న వీవోఏలకు ఉద్యోగ కల్పించాలని ఐకేపీ వీవోఏ సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం కారేపల్లి మండలం గాంధీనగర్‌లో వీవోఏ ల యూనియన్ మహాసభ జరిగింది. ఈసభలో కుర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ వీవోఏ లపై పని భారం పెరిగిందని, పనికి తగ్గ వేతనం అందటం లేదన్నారు. వీవోఏ లకు రూ. 25 వేలు వేతనం ఇవ్వాలని, అర్హత ఉన్న వీవోఏల ను సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. జీవో నెం. 58 సవరించి గౌరవేతనం కాకుండా వేతనాలను వీవోఏ ల వ్యక్తిగత ఖాతా నందు జమ చేయాలన్నారు. రూ.10 లక్షల భీమా సౌకర్యంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్ కోడ్ కల్పించి ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. వీవోఏలకు ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



వీవోఏ నూతన కమిటీ ఎన్నిక

సింగరేణి మండల వీవోఏ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా కుర్ర శ్రీనివాసరావు,కార్యదర్శిగా ధారావత్ సంగీ□,□ కోశాధికారిగా పప్పుల నిర్మ□, ఉపాధ్యక్షులుగా ధారావత్ బుజ్జి, సహాయ కార్యదర్శిగా తురపాకా విజయనిర్మల, గౌరవ అధ్యక్షురాలుగా ఇరప సువాసిని, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బర్మావత్ కో{,□ పోతు రమాదేవి, ప్రచార కార్యదర్శిగా కొలిశెట్టి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా ఎలుక లాజరును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# దుబ్బతండా చెరువు లూటీ, వివాదం

**పలువురిపై కేసు నమోదు**

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం, దుబ్బ తండాలో చెరువు లో చేపల లూటీ ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. చెరువు నుంచి అనుమతి లేకుండా చేపలు పట్టే విషయంలో గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారంతో విషయం బయటపడగా, ఒక వర్గం చెరువు చేపలు అక్రమంగా పడుతున్నారని ఆరోపించారు. దీనికి మరో వర్గం తీవ్రంగా ప్రతిస్పందించడంతో వాగ్వాదం చోటుచేసుకుని, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్సై బైరు గోపి సంఘటనా విషయమై పరిస్థితిని సమీక్షించారు. చెరువు లూటీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

# ఘనంగా పోషణ పక్వాడ వేడుకలు..

**గర్భిణీలకు శ్రీమంతం.. చిన్నారులకు అక్షరాభ్యాసం..**

**ముఖ్య అతిథిగా సర్పంచ్ పూనెం రమేష్ హాజరు..**

**మణుగూరు, మహా :** పోషణ పక్వాడ కార్యక్రమాల సందర్భంగా మణుగూరు మండలం సమితిసింగారం సెక్టార్‌లోని లంకమల్లరం గ్రామ పంచాయతీ పరిధిలో బ్రహ్మంగారిగుట్ట అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి, వారికి పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి విద్యాప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పూనెం రమేష్ హాజరై మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ఎంతో అవసరమని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ హైమవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పి మంగతాయి, ఏఎన్ఎం సుమలత, ఆశ కార్యకర్త శైలేజతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



# కోర్టు ధిక్కరణ కేసులో ఆర్డీవో వెంకటరెడ్డికి నెల రోజులు

**జైలు శిక్ష, రెండువేల జరిమాన**

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ ఆర్డీవో రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ వెంకటరెడ్డి పై కోర్టు దిక్కరణ కేసులో శిక్ష విధించారు. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ రెవిన్యూ పరిధిలోని 74 ఎకరాల భూ వివాదంపై నిర్ణీత గడువులోపు ఉత్తర్వులు జారీ చేయ లేకపోయారు. అనే కేసులో బాధితుడు యూసుఫుదీన్ హైకోర్టును ఆశ్రయించారు. కేసును చేపట్టి విచారించిన న్యాయస్థానం సంబంధిత రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డికోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేశారని నిర్ధారించింది. కోర్టు



ధిక్కరణ చేశారని భావించిన కోర్టు ఒక నెల జెలు శిక్షతోపాటు 2000 రూపాయలు జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. 2000 రూపాయలు జరిమానా చెల్లించిన యెడల అదనంగా రెండు వారాలపాటు జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని స్పష్టం చేసింది. అప్పి ల్ దాఖలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ రెండు వారాలపాటు తీర్పును నిలిపివేసింది.

# అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

# మేడేను జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య**

**రాజేంద్రనగర్ మహా ;** నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసేంతవరకు పోరాడుదాం, అంటూ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య తెలిపారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం శంషాబాద్ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రామస్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసేంతవరకు కార్మిక వర్గం పోరాటాలు చేస్తూ ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో లక్ష మంది కార్మికులు ఉన్నారు. మనమందరం ఐక్యంతో ఏఐటీయూసీ సారధ్యంలో పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ అన్ని రంగాల్లోని కార్మికుల కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టర్లు కార్మికులపై పెత్తనం చెలాయిస్తున్నారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేసెలా పోరాటాల కేంద్రంగా కార్మిక వర్గాలు మే డేను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దత్తు నాయక్, కార్యదర్శులు మల్లేష్, వనంపల్లి జైపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, నర్రగిరి, సక్రు నాయక్, రాజు, బాబురావు, ప్రభాకర్, శివయ్య, చంద్రయ్య, కాజా భాష తదితరులు పాల్గొన్నారు.




# మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం!

- **ఎమ్మెల్యే రంగారెడ్డి పై సత్య ఆరోపణలు మీకు తగదు**
- **మాజీ ఎమ్మెల్యే చేసిన భూకజాలను త్వరలో వెలికి తీస్తాం**
- **ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి...**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే రంగారెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి దిష్టి బొమ్మను అంబేద్కర్ చౌరస్తాలో సాగర్ రహదారిపై దగ్ధం చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏదుల పాండురంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి భూపతిగల్ల మహిపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏదుల జంగారెడ్డి, నీళ్ల భాను గౌడ్, రాందాస్, ఏఎంసి డైరెక్టర్ డి రాజు, మంకాల దాసు హాజరై మాట్లాడుతూ... ఎమ్మెల్యే రంగారెడ్డి పై అసత్య ఆరోపణలు చేయడం మీకు తగదని హెచ్చరించారు. గత పది సంవత్సరాల పాలనలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని పట్టించుకోలేని అసమర్థ నాయకుడివి, నేడు ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని అన్నారు. భూ కజ్జాల మీద పెట్టిన దృష్టి, నియోజకవర్గం అభివృద్ధిపై పెట్టలేదని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో అత్యధిక నిధులు వెచ్చించి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన భూకబ్జాలను ఒక్కొక్కటిగా త్వరలో వెలికి తీసి నిరూపిస్తామని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హెచ్చరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆకుల ఆనంద్, కప్పరి చందు, మొహమ్మద్ గౌస్, రాఘవేందర్, రమేష్ దశరథ తిరుమల్, ఆముదాల యాదగిరి, సికిందర్ రెడ్డి, భరత్ రెడ్డి పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఫుట్ పాత్ ఆక్రమణలపై జిహెచ్ఎంసి అధికారుల కొరడా...

**రాజేంద్రనగర్, మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి నుండి అరంఘర్ వరకు ఫుట్ పాత్ ఆక్రమణలపై జిహెచ్ఎంసి అధికారులు కొరడా జులిపించారు. ఫుట్ పాత్ ఆక్రమణతో ట్రాఫిక్ జామ్ తో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఫుట్ పాత్ చిరు వ్యాపారులకుపలుమార్లు హెచ్చరికలు జారీ చేసిన వారి నుండి స్పందన రాకపోవడంతో శనివారం టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజలకు, వాహనదారులకు పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి, నగరంలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో ట్రాఫిక్ ఈ అనుకూలంగా ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నమన్నారు. నిబంధనలను ఉల్లంఘించి తిరిగి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేస్తే, వారి పై కఠిన చర్యలు తీసుకుంటాము. నిర్మాణాలను కూడా కూల్చి వేస్తామని జిహెచ్ఎంసి అధికారులు హెచ్చరించారు.



# నెర్రపల్లిలో ఉపాధి హామీ కూలీలతో కార్యదర్శి రాజ్ కుమార్

**ఉపాధి కూలీలకు సలహాలు సూచనలు ఇచ్చిన కార్యదర్శి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నెర్రపల్లి గ్రామ ఉపాధి హామీ కూలీలను పరామర్శించిన, పంచాయతి కార్యదర్శి రాజ్ కుమార్ వసతులు కల్పిస్తామని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పని వద్దకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ వారిని పరామర్శించి, కూలీలకు కావాల్సిందిగా వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత పెరగడంతో కూలీలు ఉదయం 6 గంటలకు వచ్చి, ఎన్ఎంఎం యాప్ లో ఫోటో అప్లోడ్ చేసేది ఉంటుందని కావున కూలీలు పని ప్రదేశంలో పాల్గొన్న నాలుగు గంటల తర్వాత మరోసారి ఫోటో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం తొందరగా వచ్చి కూలీ పనులలో పాల్గొనాలని సూచించారు. ఎండల దృష్ట ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గంటకోసారి నీళ్లు తాగాలని సూచించారు. గ్రామంలోని ఆశా వర్కర్ వద్ద ఓఆర్ఎస్ పాకెట్లు తీసుకొని నీళ్లలో కలుపుకొని తాగాలని, మధ్య మధ్యన నీడ ప్రదేశంలో చల్లటి గాలి ప్రదేశంలో ఉండి పని చేసుకోవాల్సిందిగా, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, తగు సలహాలు సూచనలు ఉపాధి కూలీలకు ఇచ్చారు.



# ఆదిబట్ల టిసిఎస్ లో

# అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు

- **జీవితానికి విలువ ఇద్దాం - అప్పుడే ప్రాణాలతో గమ్యానికి చేరగలరు**
- **రోడ్డు ప్రమాదాల నివారణ - ప్రాణ రక్షణకే ప్రాధాన్యత**
- **ప్రమాదాల తర్వాత ప్రాణాలను కాపాడటమే గోల్డెన్ అవర్**
- **అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) ఇక్బాల్ ఐపీఎస్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల పోలీసుల ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్', సైబర్ క్రైమ్, డ్రగ్స్, నార్కోటిక్స్ పై, టిసిఎస్ లో కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు.. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) ఇక్బాల్ ఐపీఎస్, శంషాబాద్ జోన్ డిసిపి బి రాజేష్, ఆదిభట్ల ఏసిపి ప్రదీప్ కుమార్ రెడ్డి, ఆదిభట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి రవికుమార్ ఆర్‌జిఐ ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి, 'అరైవ్ అలైవ్', సైబర్ క్రైమ్ అవగాహన, డ్రగ్స్, నార్కోటిక్స్ పై అవగాహన కల్పించారు. అనంతరం ఐపీఎస్ సిక్బల్ మాట్లాడుతూ... ప్రతిరోజూ వాహనం పరిస్థితిని తనిఖీ చేయడం, రక్షణాత్మక డ్రైవింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రాణ రక్షణకే ప్రాధాన్యత అని, సురక్షితంగా డ్రైవ్ చేయండి అరైవ్ అలైవ్ అని, ప్రమాదాల తర్వాత ప్రాణాలను కాపాడటంలో గోల్డెన్ అవర్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే మోసగాళ్ల చేతిలో ప్రజలు ఎంత సులభంగా మోసపోతున్నారో తెలియజేస్తూ, గోల్డెన్ అవర్‌లోగా సైబర్ క్రైమ్ పోలీస్/ హెల్ప్‌లైన్ 1930ని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆరోగ్యం, జీవితంపై డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకుంటూ ఉండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసేలా చూసుకుందాం, అప్రమత్తంగా ఉందాం, జీవితానికి విలువ ఇద్దాం అప్పుడే మీరు ప్రాణాలతో గమ్యానికి చేరగలరు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, ఆదిభట్ల పోలీస్ సిబ్బంది, టిసిఎస్ సంస్థల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




# గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లిలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్టౌన్ సిఐ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని పంచముఖ హనుమాన్ స్టాచ్ వద్ద అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారంతో వాహనాలను తనిఖీ చేయగా ఎండీ. ముజ్జు (25) పట్టుబడగా మరో మహిళ ఎస్.కె ఫర్జానా (48) పరారీలో ఉండగా నిందితుడి వద్ద నుండి 405 గ్రాముల గంజాయినీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.తాళ్లగురజాల ఎస్సై రామకృష్ణ తమ పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిఇన వారి వద్ద ఉన్న బైకును పరిశీలించగా సుమారుగా 405 గ్రాముల గాంజా లభ్యం కావడంతో పంచనామా నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా గత కొంత కాలంగా మహారాష్ట్ర లోని చంద్రాపూర్ కు పంపి అక్కడ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గాంజా కొని తీసుకురమ్మని చెబుతూ ఉండేదని అదే క్రమంలో శుక్రవారం రోజున డబ్బులు ఇచ్చి గాంజా కొని తీసుకోరమ్మని పంపగా రాయల్ ఎన్ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్ నెంబర్ TS 19 B 1076 అనే బైక్ పైన వెళ్లి అక్కడ గుర్తుతెలవని వ్యక్తుల దగ్గర సుమారు 405 గ్రాముల గాంజా కొనుక్కొని వస్తున్న క్రమంలో బెల్లంపల్లిలోని పంచముఖ హనుమాన్ టెంపుల్ వద్ద చేరుకోగా అక్కడ పోలీసు వాళ్ళు పట్టుకొని విచారించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి జ్యూడిషియల్ కస్టడీకి పంపినట్లు సీఐ కె శ్రీనివాస రావు వెల్లడించారు.అనంతరం మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువడబ్బులు సంపాదించాలనే ఆశతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని,గంజాయి వినియోగం ఆరోగ్యానికి హానికరమే కాకుండా కుటుంబాల్ని,సమాజాన్ని దెబ్బతీస్తుందని పేర్కొంటూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా గంజాయి అక్రమ రవాణా లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కేసును చేదించడంలో పాల్గొన్నటువంటి ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఎస్సై తాళ్ల గురజాల రామకృష్ణ,క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు,సదానందం కానిస్టేబుళ్లు దేవేందర్,రాజేష్,రామకృష్ణ ,హోంగార్డు హాజీలను డిసిపి ప్రశంసించారు.



# బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**బెల్లంపల్లి, మహా:** బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు శనివారం బెల్లంపల్లి పట్టణంలో పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన మహిళ బిల్లు వీగిపోయేలా చేసినందుకు కాంటా చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గసభ్యులు అమురాజుల శ్రీదేవి,జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్ పాల్గొని మాట్లాడుతూ నరేంద్రమోడీ మహిళల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని నరేంద్ర మోడీ 33% రిజర్వేషన్ మహిళా బిల్లును ఆమోదించాలని మూడు రోజులుగా పార్లమెంట్లో బిల్లును ప్రవేశపెట్టినా కాంగ్రెస్ కూటమి మహిళా బిల్లును వీగిపోయాలా చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబపాలన తప్ప మహిళలకి మంచి చేయాలని రాజకీయంలోకి మహిళలు అన్నిట్లో ముందుండాలని ఆలోచన లేదని,ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నా కూడా మహిళా బిల్లు రావాలి మహిళలను ముందుఉంచాలని ఏరోజు కూడా వారు పోరాడలేదని గుర్తు చేశారు. పార్లమందులో అవకాశాన్ని కూడా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాకుండా చేసినందుకు మహిళలందరికీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి కోడి సురేష్, ఉపాధ్యక్షురాలు సల్లంసుమలత, లీగల్ సెల్ కన్వీనర్ గోలి శ్రీనివాస్, కోదాటి కళావతి,నిట్ట అరుణ సుందరి, బాబు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# దక్షిణాది అస్తిత్వానికి కాంగ్రెస్ 'కాలకూట' విషం

**ఢిల్లీ, మహా:** దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండి' కూటమి అత్యంత ప్రమాదకరమైన వ్యూహంతో ముందుకు వెళ్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ నీతిని ఎండగట్టారు. బయటకు 'దక్షిణాది ఆత్మగౌరవం' అంటూ ప్రగల్భాలు పలికే ఈ పార్టీలు, పార్లమెంటు లోపల మాత్రం దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా వ్యవహరించడం శోచనీయమని మండిపడ్డారు. ముఖ్యంగా రాజ్యాంగంలోని అధికరణ 81 ప్రకారం 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ కవచంలా నిలవాల్సిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన అసలు నైజాన్ని బయటపెట్టుకుందని ఆయన విశ్లేషించారు. రాజ్యాంగ ప్రతులలో పేర్కొన్న విధంగా, 2026 తర్వాత చేపట్టే తొలి జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఈ క్రమంలో జనాభాను నియంత్రించి, అక్షరాస్యతలోనూ, అభివృద్ధిలోనూ దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ వంటి రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే, అభివృద్ధి చెందిన రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరిగే అవకాశం ఉంది. ఈ అన్యాయాన్ని అడ్డుకోవడానికి, దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గకుండా రక్షణ కల్పించే ఉద్దేశంతో ఎన్డీయే ప్రభుత్వం 131వ సవరణ బిల్లును ప్రతిపాదించిందని బండి సంజయ్ గుర్తు చేశారు. అయితే, కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ కూటమి ఈ బిల్లును అడ్డుకుని దక్షిణాది ప్రజల వెన్నుపోటు పొడిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ విషయంలో అత్యంత స్పష్టమైన హామీ ఇచ్చారని బండి సంజయ్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గవని, అవసరమైతే 50 శాతం సీట్ల పెరుగుదలకు కూడా తాము సిద్ధమని ప్రకటించినా, ప్రతిపక్షాలు మాత్రం మౌనం వహించడం వారి కుట్రకు నిదర్శనమన్నారు.

# సమైక్యవాదాన్ని బలహీనపరిచే డిలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిద్దాం

- **..డిలిమిటేషన్ తో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు లింకు పెట్టడం అన్యాయం**
- **...ఎంసీపీఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**

**బెల్లంపల్లి, మహా:** ఎంసిపిఐయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బెల్లంపల్లి పట్టణంలోనీ ఎంసిపిఐయు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీ లిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా అత్యవసర సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంసీపీఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హడావిడిగా ప్రవేశపెట్టిన మహిళ రిజర్వేషన్ బిల్లును లింకు పెట్టుకుని నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పెంచుకొని 2029 ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నాలకు పార్లమెంటులో అడ్డుకట్ట పడిందన్నారు.మహిళారిజర్వేషన్ బిల్లు అనే సెంటిమెంటుతో ప్రచారం చేసిన తమ రాజకీయాన్ని లక్ష్యం నెరవేర్చేందుకు ప్రధానమంత్రి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించ లేదన్నారు. పార్లమెంటు సాక్షిగా ఎన్డీఏ కుట్రలను ఎండగట్టి మహిళా రిజర్వేషన్ బిల్లుతో తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లుల కుట్రలను బయటపెట్టిందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుకు ఎవరు వ్యతిరేకం కాదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లు ల గురించి పెద్దగా చర్చలేకుండా చేశారని కేంద్రపాలకులు చేస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడాలున్నారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలమైన బీజేపీ రాష్ట్రాలలో 2011 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంట్ సీట్లు పెంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నధన్నారు. దక్షిణ భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంటు సీట్లు తగ్గే ప్రమాదం ఉందన్నారు 2026 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంటు సీట్లు దక్షిణ భారతదేశంలో పెంచాలని ఎంసిపిఐయు పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి డీలిమిటేషన్ బిల్లు ప్రకారం అన్యాయం జరుగుతుందన్నారు.



# ధాన్యం సేకరణలో మిల్లర్ల పెత్తనం సాగనివ్వం..

కొనుగోలు కేంద్రాల్లోనే తూకం తరుగు పేరుతో వేధిస్తే చర్యలు తప్పవు..
రైతు నేరుగా మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి





**నల్గొండ, మహా :** ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల ప్రకారమే ధాన్యం సేకరణ జరగాలని ఇందులో మిల్లర్ల జోక్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్. కోదండరెడ్డి స్పష్టం చేశారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి, ఎస్ఎల్బీసీ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యపు రాశులను పరిశీలించి తేమ శాతం, తాలు, తరుగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు, హమాలీలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని ఇందుకు సంబంధిత శాఖల అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మిన తర్వాత రైతు మిల్లుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని కేంద్రం నుంచి మిల్లులకు ధాన్యం పంపిన తర్వాత జరిగే ప్రక్రియ అంతా అధికారుల బాధ్యతేనని కోదండరెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం అమ్మిన వెంటనే రైతుకు పక్కా రశీదు ఇచ్చి సొమ్మును నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటాకు 45 రూపాయలు మాత్రమే హమాలీ చార్జీలు వసూలు చేయాలని అంతకు మించి ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం తేమ, తాలు వంటివి కాంటా వేయకముందే కేంద్రంలోనే చూసుకోవాలని తరుగు పేరుతో రైతులను వేధించడం భావ్యం కాదని పేర్కొన్నారు. మిల్లర్లకు ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వంతో చర్చించుకోవాలి తప్ప రైతుపై పెత్తనం చేస్తామంటే కుదరదని పాత పద్ధతులు ఇకపై చెల్లవని తేల్చి చెప్పారు. తమ సొంత ఖర్చులతో ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చే రైతులకు శాస్త్రీయంగా మద్దతు ధర అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉంటూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తోందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటూ మిల్లుల వద్ద లారీలను నిలిపివేస్తూ తరుగు పేరిట క్వింటాళ్ల కొద్దీ ధాన్యాన్ని మిల్లర్లు కోత విధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మెంబర్, సెక్రటరీ గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, పౌరసరఫరాల సంస్థ డీఎం రాంపతి నాయక్, తహసీల్దార్ పరశురాం మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# భూదానోద్యమ స్ఫూర్తిని చాటిన పోచంపల్లి..

ఘనంగా 75వ వజ్రోత్సవాలు వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహావిష్కరణ..
వినోబా భావే ఆశ్రమాన్ని ప్రారంభించిన మండలి చైర్మన్ గుత్తా,
టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి..

**నల్గొండ, మహా :** చారిత్రాత్మక భూదానోద్యమానికి వేదికైన పోచంపల్లి గడ్డపై శనివారం ఆ ఉద్యమ స్ఫూర్తి మరోసారి వెల్లివిరిసింది. భూదానోద్యమం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో పలు అభివృద్ధి, స్మారక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆచార్య వినోబా భావే ప్రియశిష్యుడు దేశంలోనే తొలి భూదాత అయిన బాయి సాబ్ వెదిరె రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. రామచంద్రారెడ్డి గారు చేసిన భూదానం ప్రపంచ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టమని ఆయన త్యాగం నేటి తరానికి ఆదర్శమని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. విగ్రహావిష్కరణ అనంతరం పోచంపల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆచార్య వినోబా భావే ఆశ్రమాన్ని అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..పోచంపల్లి పేరు వినగానే భూదానోద్యమమే గుర్తుకు వస్తుందని అహింసా మార్గంలో భూ సమస్యను పరిష్కరించవచ్చని ప్రపంచానికి చాటిన ఘనత ఈ గడ్డకే దక్కుతుందన్నారు. వినోబా భావే గారు చేపట్టిన పాదయాత్రలో రామచంద్రారెడ్డి గారు చూపిన దాతృత్వం అభినందనీయమని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధేయవాదంతో లక్షలాది ఎకరాల భూమి నిరుపేదలకు పంపిణీ కావడానికి పోచంపల్లి పునాది వేసిందని అటువంటి గొప్ప ఉద్యమ 75వ వార్షికోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భూదాన్ పోచంపల్లిని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వినోబా భావే ఆశ్రమం ద్వారా ఆయన ఆశయాలను, భూదానోద్యమ విశిష్టతను భావి తరాలకు తెలిసేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా పలువురు గాంధేయవాదులు, రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొనగా అతిథులు వినోబా భావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెడితే సహించం..

- నిబంధనల ప్రకారమే కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి
- బత్తాయి సాగుపై జిల్లా రైతులు దృష్టి సారించాలి
- అధికారులు , మిల్లర్ల తో సమీక్షా సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి..



**నల్గొండ, మహా :** రబీ ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి స్పష్టం చేశారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో రైతాంగాన్ని ఆదుకుంటోందని, ధాన్యం కొనుగోలు విషయంలోనూ అధికారులు, మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారమే సేకరణ జరగాలని రైతుకు కేవలం కొనుగోలు కేంద్రంతోనే సంబంధం ఉంటుందని, మిల్లర్ల జోక్యం ఉండకూడదని తేల్చి చెప్పారు. తాలు, తరుగు వంటి సమస్యలు ఉంటే అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప రైతులను వేధించవద్దని మిల్లర్లకు సూచించారు. ప్రస్తుతం హరిత విప్లవం తర్వాత ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందని దీనివల్ల ఏటా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా సంప్రదాయ పంటల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. గతంలో జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో ఉన్న బత్తాయి సాగు ఇప్పుడు 40 వేల ఎకరాలకు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తిరిగి ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. రైతులు సంఘటితంగా ఉండేందుకు రైతు ఉత్పాదక సంస్థలను (FPO) ఏర్పాటు చేసుకోవాలని కష్టాల్లో ఉన్న రైతును ఒంటరిని చేయకుండా ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మిల్లర్లకు ఉన్న బాయిల్డ్ రైస్ సమస్యతో పాటు ఇతర సాంకేతిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లాలో ధాన్యం సేకరణ గణాంకాలను వివరిస్తూ.. ఈ యాసంగిలో 5.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని సుమారు 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 439 కేంద్రాలను ప్రతిపాదించగా ఇప్పటికే 330 కేంద్రాలను ప్రారంభించి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మిల్లర్ల సమస్య వల్ల నిలిచిపోయిన అన్‌లోడింగ్ ప్రక్రియ శుక్రవారం జరిగిన చర్చలతో పరిష్కారమైందని ఇకపై సేకరణ వేగవంతం అవుతుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఈ సందర్భంగా చైర్మన్‌కు సాదర స్వాగతం పలికారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులు, సాదాబైనామాల పరిష్కారంపై చైర్మన్ అడిగిన వివరాలకు స్పందిస్తూ మార్చి 15 నాటికి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని, సాదాబైనామాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వివిధ శాఖల అధికారులు, మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి బహుమతులు గెలుచుకోండి..!

- వాహనదారులకు 'జీరో ఎన్ఫోర్స్‌మెంట్'తో పోలీసుల అవగాహన..
- నిబంధనలు పాటించిన వారికి డీఎస్పీ చేతుల మీదుగా బహుమతులు..
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వినూత్న కార్యక్రమం..






**నల్లగొండ టౌన్, మహా :** ట్రాఫిక్ నిబంధనలంటే కేవలం జరిమానాలు మాత్రమే కాదని, అవి ప్రాణ రక్షణ కవచాలని నల్లగొండ పోలీసులు వాహనదారులకు వినూత్న రీతిలో వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజు వేడుకల్లో భాగంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాలతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మార్గదర్శకత్వంలో శనివారం పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు "జీరో ఎన్ఫోర్స్‌మెంట్" విధానాన్ని అవలంబించారు. సాధారణంగా తనిఖీలు అంటే జరిమానాల భయం ఉండే వాహనదారులకు ఈసారి పోలీసులు కేవలం అవగాహన కల్పించడం ద్వారా ఆశ్చర్యపరిచారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే ట్రాఫిక్ నియమాలను నిబద్ధతతో పాటిస్తున్న వారిని పోలీసులు ప్రోత్సహించడం. రహదారిపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులను గుర్తించి వారిని ఆపి మరీ సత్కరించారు. వేద డాన్స్ అకాడమీ సహకారంతో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి చేతుల మీదుగా క్రమశిక్షణ గల వాహనదారులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ వినూత్న ప్రయోగం వాహనదారుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. కేవలం చలాన్ల ద్వారా భయపెట్టడం కంటే ఇలా గౌరవించి బహుమతులు ఇవ్వడం వల్ల ప్రజల్లో బాధ్యత పెరుగుతుందని డీఎస్పీ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి...

**ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి వినతి**



**ఢిల్లీ:** బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రులకు వివరించారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కోరారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల వలన దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబద్ కేంద్రంగా నిలవగలదని కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# కామారెడ్డిలో దారుణం

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని బాలుడి హత్య

**కామారెడ్డి, మహా :** కామారెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ఐదేళ్ల బాలుడిని హత్య చేసిన సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, లక్ష్మి అనే మహిళ భర్తతో కొన్నేళ్ల క్రితం గొడవ పడి విడిపోయింది. ఆమెకు సమీర (8) అనే కూతురు, శ్రావణ్ (5) అనే కొడుకు ఉన్నారు. గత ఆరు నెలలుగా నర్సింహులు అనే వ్యక్తితో లక్ష్మి సహజీవనం చేస్తోంది. అయితే లక్ష్మి కుమారుడు శ్రావణ్ తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన నర్సింహులు, బాలుడిని హత్య చేయాలని ముందుగానే పథకం రచించినట్లు తెలుస్తోంది. ఇంట్లో లక్ష్మి లేని సమయంలో బాలుడి కళ్లలో కారం కొట్టి, గొంతు నులిమి, అనంతరం కర్రతో తలపై బాది నేలకేసి కొట్టి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. కేసు నమోదు చేసి లక్ష్మి, నర్సింహులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన సమాజంలో పెరుగుతున్న నేరప్రవృత్తులపై మరోసారి ఆందోళన వ్యక్తం చేసేలా చేసింది.

# వేసవి తాపం నుంచి కాస్తంత ఉపశమనం

**5 రోజులపాటు వర్షా లు..పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు**

**హైదరాబాద్, మహా :** ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. రాబోయే 5 రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం వెల్లడించింది. ఈ మేరకు తాజాగా వెదర్ బులెటిన్‌ను విడుదల చేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం సూచించింది. రాబోయే రెండు రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని పేర్కొంది. అయితే వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల అకస్మాత్తుగా గాలులు వీచి, వర్షం కురిసే సూచనలు ఉన్నాయని అంచనా వేసింది. వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం ఏప్రిల్ 18 నుండి ఏప్రిల్ 23వ తేదీ వరకు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. చాలా జిల్లాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి.

**ఎల్లో హెచ్చరికలు జారీ**

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే ఛాన్స్ ఉంది. గాలి వేగం గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల మేర వీచే అవకాశం ఉంటుంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే ఛాన్స్ ఉంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్.మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయి. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, భువనగిరి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాలు పడుతాయి. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. అకాల వర్షాల నేపథ్యంలో పాత భవనాలు, హోర్డింగ్‌లు, చెట్ల కింద ఉండటం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**మున్సిపల్ చైర్మన్ భీజన బాలమణి భాస్కర్**



**ధర్మఘంట ఆలేరు:** ఆర్ పి ఆర్ పి గురుకుల బాలికల హాస్టల్ ను యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ భీజన బాలమణి భాస్కర్ కౌన్సిలర్లు, కమీషనర్ తో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు...ఈ సందర్భంగా హాస్టల్ లో వసతులను పరిశీలించారు విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారుఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూసవతి సౌకర్యాలు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , కౌన్సిలర్లు కోమల్ల మౌనిక హరీష్, పస్తం అంజనేయులు, జూకంటి సంపత్, జెట్ట నీరజ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది చారిత్రక ద్రోహం

- గృహనిర్బంధాలతో నిరసనలను అణచివేయడం రేవంత్ రెడ్డి తరం కాదు!
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపురాజు రామచంద్రరావు



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువల హననం జరుగుతోందని, నిరసన గళాలను ఇనుప బూట్లతో తొక్కేయాలని చూడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనానికి సంకేతమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపురాజు రామచంద్రరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ముఖ్యమంత్రి నివాస ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో, శాంతిభద్రతల సాకుతో పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి విపక్ష నేతలను గృహనిర్బంధం చేయడంపై ఆయన అగ్గిమీద గుగ్గిలమయ్యారు. అక్రమ అరెస్టులు, పోలీస్ బారికేడ్లతో నారీశక్తి ప్రభంజనాన్ని అడ్డుకోవచ్చని భావిస్తే అది ముఖ్యమంత్రి రాజకీయ అజ్ఞానమే అవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ, రాచరిక పోకడలను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ తీరుపై ఆయన విరుచుకుపడ్డారు.దేశ చరిత్రలో మహిళా సాధికారతకు దిక్సూచిగా నిలిచిన మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టసభల్లో అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ మరియు 'ఇండి' కూటమి తమ మహిళా వ్యతిరేక డీఎన్ఏను మరోసారి చాటుకున్నాయని రామచంద్రరావు దుయ్యబట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు అత్యంత సాహసోపేతంగా, చిత్తశుద్ధితో తీసుకువచ్చిన ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకోవడం మహిళా లోకానికి చేసిన వెన్నుపోటు అని ఆయన అభివర్ణించారు. దశాబ్దాలుగా మహిళలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసిన కాంగ్రెస్ పార్టీ, నేడు వారు చట్టసభల్లో సగర్వంగా అడుగుపెట్టే అవకాశాన్ని కాలరాయడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. ఈ ద్రోహం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహమే నేడు రేవంత్ సర్కారును వణికించిందని, అందుకే పోలీసుల చాటున ప్రభుత్వం దాక్కుంటోందని ఆయన విశ్లేషించారు.ముఖ్యమంత్రి నివాసం ముట్టడి అనేది కేవలం ఒక నిరసన కార్యక్రమం మాత్రమే కాదని, అది కోట్లాదిమంది మహిళల ఆవేదనకు ప్రతిరూపమని రామచంద్రరావు స్పష్టం చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని తనను నివాసంలోనే నిర్బంధించడం ద్వారా నిరసన జ్వాలలను ఆపలేరని, ఈ నిర్బంధాలు పోరాట పటిమను మరింత ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. ఒకవైపు మహిళా సంక్షేమం గురించి ఆకాశమే హద్దుగా ప్రసంగాలు చేస్తూ, మరోవైపు వారి హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. పితృస్వామ్య అహంకారంతో నిండిన కాంగ్రెస్ నాయకత్వం మహిళా శక్తిని తక్కువ అంచనా వేస్తోందని, రాబోయే రోజుల్లో అదే శక్తి ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# జనగణన మొదటి దశ శిక్షణ తరగతుల్లో అధికారులకు సూచనలు

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**






**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బీబీనగర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన జనగణన మొదటి దశ శిక్షణ తరగతిలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పాల్గొని అధికారులకు తగు సూచనలు సలహాలు అందించారుఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 50 మంది ఎనుమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.ఈ శిక్షణ తరగతులు శనివారం, సోమవారం మరియు మంగళవారం రోజుల్లో కూడా కొనసాగనున్నాయి.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి గారు, ఎంపీడీఓ గ, యం ఈ ఓ, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు

- క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పరిశీలన
- జూన్ 2న ఎయిర్‌పోర్ట్ భూమిపూజ?

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్‌లో కొత్తగా అతిపెద్ద విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం అంచనా వేసిన భూమి కంటే రెట్టింపు స్థాయిలో భూమి అవసరమని తాజాగా అధికారుల బృందం తేల్చింది. రక్షణ శాఖ, ఎయిర్ ఫోర్స్ కెప్టెన్లు, విమాన సాధికార సంస్థ ప్రతినిధులతో కూడిన పదిమంది సభ్యుల బృందం శుక్ర, శనివారాలలో ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇన్‌ఛార్జి కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లతో కలిసి అధికారులు ప్రతిపాదిత స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత ప్రభుత్వం ఈ విమానాశ్రయానికి 800 ఎకరాలు సరిపోతాయని భావించి రక్షణ శాఖ పరిధిలోని 369.45 ఎకరాలకు అదనంగా మరో 430.30 ఎకరాల సేకరణకు గతంలో జీవో జారీ చేసింది. అయితే తాజా సాంకేతిక పరిశీలన ప్రకారం మొత్తం 1500 ఎకరాల విస్తీర్ణం అవసరమని అధికారులు స్పష్టం చేశారు. అంటే ఇప్పుడున్న ప్రతిపాదనలకు అదనంగా మరో 800 ఎకరాలను సేకరించాల్సి ఉంటుంది. విమానాశ్రయ పరిధిలోకి వచ్చే అనుకుంట, బంగారుగూడ ప్రాంతాల్లోని వాగులు, హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రధాన అడ్డంకిగా మారాయి. వీటి మార్పుపై అధికారులు తుది నివేదికలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. భారీగా అవసరమయ్యే అదనపు భూమి కోసం అధికారులు నిషాన్ ఘాట్, అంకోలి, తంతోలి ప్రాంతాలతో పాటు మూతపడిన ప్రభుత్వ సిమెంటు పరిశ్రమ భూములను కూడా పరిశీలించారు.

# డిప్యూటీ సీఎం పవన్ పేరిట నకిలీ దందా

- ఫోర్జరీ లేఖలతో నిరుద్యోగులకు వల
- అత్తిలిలో వెలుగుచూసిన అక్రమార్కుల బాగోతం
- నిరుద్యోగుల ఆశలతో అక్రమార్కుల ఆటలు
- నకిలీ సిఫారసు లేఖలపై పోలీసుల వేట

**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరును, ఆయన కార్యాలయ ప్రతిష్ఠను అడ్డుపెట్టుకుని కొందరు అక్రమార్కులు బరితెగించారు. సామాన్య ప్రజల నమ్మకాన్ని, నిరుద్యోగుల ఆశలను పెట్టుబడిగా మార్చుకుని నకిలీ సిఫారసు లేఖలతో భారీ దందాను తెరపైకి తెచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమాయక యువతను నమ్మించేందుకు ఏకంగా డిప్యూటీ సీఎం లెటర్ హెడ్లను, ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేస్తూ అక్రమ సంపాదనకు తెరలేపడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి నియోజకవర్గ పరిధిలో వెలుగుచూసిన ఈ మోసపూరిత వ్యవహారం అధికారులను, జనసేన శ్రేణులను ఉలిక్కిపడేలా చేసింది.

**నిరుద్యోగులే లక్ష్యంగా వంచన**

అక్రమార్కులు అత్యంత వ్యూహాత్మకంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి జారీ అయినట్లుగా భ్రమ కలిగించేలా నకిలీ సిఫారసు లేఖలను సృష్టించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పించే అధికారం ఈ లేఖలకు ఉందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఈ లేఖలను వైరల్ చేస్తూ, ఉద్యోగాల ఆశతో ఉన్న నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసేందుకు కుట్ర పన్నారు. ఈ విషయం కాస్తా పార్టీ వర్గాల దృష్టికి వెళ్లడంతో అత్తిలి నియోజకవర్గ జనసేన నాయకులు తక్షణమే అప్రమత్తమయ్యారు. పవన్ కళ్యాణ్ పేరును దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

**రంగంలోకి టెక్నికల్ టీమ్**

జనసేన నాయకుల ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ నకిలీ లేఖల వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అసలు ఈ లెటర్ హెడ్లను ఎక్కడ తయారు చేశారు? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. సోషల్ మీడియాలో ఈ లేఖలను మొదట పోస్ట్ చేసిన అకౌంట్లను గుర్తించేందుకు పోలీసు టెక్నికల్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోర్జరీ సంతకాలు, నకిలీ ముద్రల వెనుక ఒక పక్కా ప్రణాళిక ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ దందాలో ఎవరెవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

**నమ్మవద్దు.. అప్రమత్తంగా ఉండండి**

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అనేది కేవలం అధికారిక నోటిఫికేషన్లు, రాత పరీక్షలు మరియు మెరిట్ ఆధారంగానే జరుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎవరైనా వ్యక్తిగత సిఫారసు లేఖల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే అది ముమ్మాటికీ మోసమేనని వారు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా ఇలాంటి దందాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జనసేన నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పేరును వాడుకుని అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉత్తర తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారబోతోంది

**రేవంత్ రెడ్డిది బీజేపీ పెద్దలతో కుదుర్చుకున్న క్రాస్ బ్రీడ్ బంధం.. మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు**



**జగిత్యాల, మహా:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి వేదిక సిద్ధమవుతోంది. రాజకీయ విలువలకు మారుపేరుగా నిలిచే కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారబోతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు. జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి పర్యటించిన ఆయన, ఈ నెల 20న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో నిర్వహించనున్న జీవన్ రెడ్డి చేరిక సభ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నిప్పులు చెరిగారు. జీవన్ రెడ్డి వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడం ఒక్క కరీంనగర్ జిల్లాకే కాకుండా, యావత్ ఉత్తర తెలంగాణలో పార్టీకి కొండంత బలాన్ని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోగతం స్పష్టంగా ఉందన్న ఆయన, "రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి" అన్న నినాదం ఇవాళ పల్లె పల్లెనా మారుమోగుతోందని, జీవన్ రెడ్డి నిర్ణయమే దానికి సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు.

పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవానికి జరిగిన అవమానంపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం ద్వారా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెలను గాయపరిచారని మండిపడ్డారు. దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన ఆర్టికల్ 3 ప్రకారం, ఉభయ సభల్లో బిల్లులు ఆమోదం పొంది, రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రజాస్వామిక పద్ధతిలో ఏర్పడిన తెలంగాణను కించపరచడం బీజేపీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ఒక ఎంపీ ఇంత బాధ్యతారహితంగా మాట్లాడుతుంటే, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆ వ్యాఖ్యలను ఖండించాల్సింది పోయి, వాటిని సమర్థించేలా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియని వారు ఇక్కడి ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారని, తక్షణమే బీజేపీ నాయకత్వం రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఈ అవమానాన్ని ఎన్నటికీ మర్చిపోదని హెచ్చరించారు.

లోక్‌సభలో ప్రస్తుతం తెలంగాణ గొంతుక వినిపించే నాథుడే కరువయ్యారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి 16 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, రాష్ట్ర ఆత్మగౌరవం దెబ్బ తింటుంటే వారంతా మౌన ముద్రలో ఉండటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అదే పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ఉండి ఉంటే, తేజస్వి సూర్యకు తెలంగాణ బిడ్డల సత్తా ఏంటో తెలిసేలా మూతి పగిలే సమాధానం చెప్పేవారమని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో కేవలం ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు ఉన్నప్పటికీ, కేంద్ర జల వనరుల మంత్రి తప్పుడు గణాంకాలు చెప్పినప్పుడు గర్జించి, స్పీకర్‌ను కలిసి ఆధారాలతో సహా రికార్డులను సవరించిన ఘనత తమ పార్టీదేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగడుతూ, ఆయన 'బడే భాయ్' మోదీకి భయపడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీపై పోరాటం చేస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో బీజేపీ కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ నివాసానికి వెళ్లి విందులు ఆరగించడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చెబుతున్న 'హైబ్రిడ్ మోడల్' అసలు స్వరూపం ఇవాళ బయటపడిందని, అది నిజానికి బీజేపీతో కుదుర్చుకున్న 'క్రాస్ బ్రీడ్' బంధమని ఘాటుగా విమర్శించారు. ఈ వింత సిద్ధాంతం రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి అర్థమవుతుందో లేదో వారే చెప్పాలన్నారు. రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలేసి, తన రాజకీయ ఉనికి కోసం ఢిల్లీ పెద్దల చుట్టూ తిరుగుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు.

మహిళా రిజర్వేషన్ల అంశంలో కూడా కాంగ్రెస్, బీజేపీలు కలిసి నాటకమాడాయని హరీశ్ రావు ఆరోపించారు. మహిళా బిల్లును డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడమే వారి చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని, కేవలం ఓట్ల కోసమే మహిళలను మోసం చేశారని విమర్శించారు. మహిళల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఉన్న గౌరవం ఎనలేనిదని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ల కోసం ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. తెలంగాణను అవమానించిన వారిని, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన వారిని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ క్షమించరని, బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ రాష్ట్ర హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుందని హరీశ్ రావు పునరుద్ఘాటించారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక నవశకం

- శ్రీసిటీలో పీజీ టెక్నోప్లాస్ట్ మెగా పెట్టుబడి
- ఉపాధి కల్పనలో రాష్ట్రం అగ్రగామి

**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగం ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. పెట్టుబడుల స్వర్గధామంగా శ్రీసిటీ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. పీజీ టెక్నోప్లాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 1,305 కోట్ల భారీ పెట్టుబడితో తన ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం నుండి తుది అనుమతులు సాధించింది. ఈ మెగా ప్లాంట్ ద్వారా సుమారు 2,910 మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా కొలువులు లభించబోతున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న మార్పులు ఈ స్థాయి పెట్టుబడులకు ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ విండో అనుమతుల విధానం పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంచింది. శ్రీసిటీలో ఇప్పటికే ఉన్న మౌలిక వసతులు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు ఈ సంస్థ నిర్ణయం తీసుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్ల తయారీలో అగ్రగామిగా ఉన్న పీజీ గ్రూప్ రాకతో తిరుపతి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. దీనివల్ల కేవలం ప్రత్యక్ష ఉపాధియే కాకుండా లాజిస్టిక్స్, అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది మందికి పరోక్ష అవకాశాలు దక్కుతాయి. పారిశ్రామికాభివృద్ధి ద్వారానే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో పెట్టుబడుల విషయంలో ఉన్న అడ్డంకులను తొలగించి పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. రాబోయే రెండేళ్లలో ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ హబ్‌గా దేశంలోనే గుర్తింపు పొందుతుంది. యువతకు సొంత రాష్ట్రంలోనే ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యానికి ఈ మెగా పెట్టుబడి ఒక గొప్ప ఊతం ఇస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

## న్యాయ ధిక్కారానికి 'కటకటాల' శిక్ష

- అత్తాపూర్ ఆర్డీవోకు నెల రోజులు జైలు..
- హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మహా:** ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఉక్కుపాదం మోపింది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన అత్తాపూర్ ఆర్డీవో కొప్పుల వెంకట్ రెడ్డికి నెల రోజుల సాధారణ జైలు శిక్ష మరియు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం శనివారం చారిత్రక తీర్పు వెలువరించింది. సామాన్య ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన ఉన్నతాధికారులు, కోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ తీర్పు రెవెన్యూ యంత్రాంగంలో పెను సంచలనంగా మారడమే కాకుండా, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులకు ఒక గట్టి హెచ్చరికగా నిలిచింది. ఈ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ మండలం పెద్దషాపూర్ పరిధిలోని సుమారు 74 ఎకరాల భూమికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన యూసుఫుద్దీన్ ఖాన్ గత కొంతకాలంగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ భూవివాదంపై తగిన విచారణ చేపట్టి, చట్టప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన రెవెన్యూ అధికారులను కోరారు. అయితే, ఆర్డీవో కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గత ఏడాది ఫిబ్రవరిలో విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆరు వారాల గడువులోగా ఈ భూమికి సంబంధించి తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్డీవో వెంకట్ రెడ్డిని ఆదేశించింది. కోర్టు స్పష్టమైన గడువు విధించినప్పటికీ, సదరు అధికారి ఆ ఉత్తర్వులను అమలు చేయడంలో విఫలమయ్యారు. కోర్టు నిర్దేశించిన సమయం ముగిసినా తన విన్నపంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, పిటిషనర్ యూసుఫుద్దీన్ ఖాన్ తిరిగి హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం, ఆర్డీవో తీరును తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం కేవలం విధి నిర్వహణలో లోపం మాత్రమే కాదని, అది న్యాయవ్యవస్థను కించపరచడమేనని అభిప్రాయపడింది. విచారణ సమయంలో ఆర్డీవో తరపు న్యాయవాదులు వివరణ ఇస్తూ, ఆలస్యంగానైనా ఉత్తర్వులు జారీ చేశామని కోర్టుకు విన్నవించినప్పటికీ ధర్మాసనం దానిని ఏమాత్రం అంగీకరించలేదు. నిర్దేశించిన గడువును పాటించకపోవడమే ధిక్కరణకు నిదర్శనమని, ఆ తర్వాత చేసే పనులు శిక్ష నుండి మినహాయింపు ఇవ్వవని స్పష్టం చేస్తూ ఈ కఠిన నిర్ణయాన్ని వెలువరించింది. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో భూరికార్డుల ప్రక్షాళన మరియు ధరణి సమస్యలపై ప్రజల నుండి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్న తరుణంలో, ఒక కీలక స్థాయి అధికారికి జైలు శిక్ష పడటం పాలనా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. న్యాయస్థానాలు ఇచ్చే ఆదేశాలను సాకులు చెబుతూ వాయిదా వేసే సంస్కృతికి ఈ తీర్పు చెక్ పెడుతుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, చట్టాన్ని అమలు చేయాల్సిన వారే చట్టాన్ని ధిక్కరిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఈ ఘటన నిరూపించింది. శిక్ష విధిస్తూనే, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును కొంతకాలం వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఈ తీర్పు అధికారుల పనితీరుపై ఒక మాయని మచ్చగా మిగిలిపోనుంది.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు శస్త్రచికిత్స



- అధికారులతో సమీక్ష నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థత
- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు
- వైద్య పరీక్షల అనంతరం అత్యవసర సర్జరీ
- ప్రస్తుతం నిలకడగా ఉన్న పవన్ కళ్యాణ్ ఆరోగ్యం
- దీర్ఘకాలిక జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యుల సూచన

**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనకు శనివారం సాయంత్రం వైద్యులు అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ హఠాత్పరిణామంతో జనసేన శ్రేణుల్లో మరియు ఆయన అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం పూర్తిగా నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై జనసేన పార్టీ ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేస్తూ పూర్తి వివరాలను వెల్లడించారు.

శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో అధికారులతో కలిసి పలు కీలకమైన పాలనాపరమైన విషయాలపై పవన్ కళ్యాణ్ సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమావేశం జరుగుతున్న సమయంలోనే ఆయన ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. గత కొద్ది నెలలుగా ఆయనను కొన్ని ఆరోగ్యపరమైన ఇబ్బందులు వేధిస్తున్నట్లు సమాచారం. తీవ్రమైన శారీరక శ్రమ, రాజకీయ మరియు పాలనాపరమైన ఒత్తిడి కారణంగా ఈ అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. అస్వస్థతకు గురైన వెంటనే, తన వ్యక్తిగత వైద్యుల సలహా మేరకు శుక్రవారం నాటి తన అధికారిక కార్యక్రమాలు, ముందస్తు పర్యటనలన్నింటినీ ఆయన తక్షణమే రద్దు చేసుకున్నారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హుటాహుటిన ఒక ఆసుపత్రికి వెళ్లారు.

ఆసుపత్రికి చేరుకున్న వెంటనే నిపుణులైన వైద్యుల బృందం పవన్ కళ్యాణ్‌కు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించింది. పరిస్థితిని మరింత స్పష్టంగా అంచనా వేసేందుకు ఎంఆర్ఐ (MRI) స్కాన్ కూడా తీశారు. ఈ పరీక్షల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన వైద్యులు, ఆయనకు తక్షణమే శస్త్రచికిత్స చేయవలసి ఉంటుందని నిర్ధారించారు. పరిస్థితిని గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా శనివారం సాయంత్రం అత్యవసరంగా సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్స అనంతరం ఆయన క్రమంగా కోలుకుంటున్నారని, ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. శస్త్రచికిత్స నేపథ్యంలో పవన్ కళ్యాణ్ కనీసం వారం నుంచి పది రోజుల పాటు సంపూర్ణ విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు కచ్చితమైన సూచనలు చేశారు. విశ్రాంతి అనంతరం ఆయన క్రమంగా తన దైనందిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే, ఆయనకు పూర్తి స్థాయిలో స్వస్థత చేకూరడానికి మరికొంత సమయం పడుతుందని, భవిష్యత్తులోనూ దీర్ఘకాలం పాటు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని డాక్టర్లు స్పష్టం చేశారు. వైద్యుల సూచనల మేరకు, ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆయన చేపట్టాల్సిన అధికారిక పర్యటనలు, అలాగే జనసేన పార్టీ తరపున జరగాల్సిన పలు కార్యక్రమాలు అన్నీ తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని తిరిగి పూర్తి ఆరోగ్యంతో ప్రజాసేవలో పాల్గొనాలని పలువురు రాజకీయ ప్రముఖులు, ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## డాలర్ల వర్షం.. కానీ ఖర్చుల తుఫాన్!

జీతం పెద్దది.. కానీ సేవింగ్స్ చిన్నవి.. కలలు నెరవేరినా ఖర్చులు తడిసి ముద్ద
విలాసమా.. పొదుపా.. తేల్చుకోవాల్సింది మీరే.. భారత్ వర్సెస్ అమెరికా

**హైదరాబాద్, మహా:** అమెరికా అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది డాలర్లలో సంపాదన, విలాసవంతమైన జీవితం. ఏటా లక్షల రూపాయల ప్యాకేజీలు ఉంటాయన్న ఆశతో ఎంతో మంది యువత అగ్రరాజ్యానికి వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. అయితే, అక్కడ వచ్చే భారీ వేతనాలకు తగ్గట్టుగానే జీవన వ్యయం (కాస్ట్ ఆఫ్ లివింగ్) కూడా ఏ స్థాయిలో ఉంటుందన్నది తాజా గణాంకాలను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది. భారతదేశం మరియు అమెరికా మధ్య నెలవారీ ఖర్చులు, సగటు వార్షికాదాయంపై ఒక ఆసక్తికరమైన తులనాత్మక విశ్లేషణ తెరపైకి వచ్చింది. ఇరు దేశాల మధ్య అద్దెలు, ఆహారం, రవాణా, విద్యుత్ వంటి కనీస అవసరాల ఖర్చులను బేరీజు వేస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడయ్యాయి.

**ఆదాయంలో ఆకాశమే హద్దు.. కానీ ఇక్కడే అసలు చిక్కు**

సగటు వార్షికాదాయం పరంగా చూస్తే భారత్‌తో పోలిస్తే అమెరికా ఎంతో ముందుంది. మన దేశంలో ఒక సగటు ఉద్యోగి వార్షికాదాయం సుమారు రూ.7.5 లక్షలుగా ఉంటే.. అదే అమెరికాలో ఏకంగా రూ.55.20 లక్షల వరకు ఉంటోంది. ఈ భారీ వ్యత్యాసమే ఎంతో మందిని ఆకర్షిస్తోంది. కానీ, నెలవారీ ఖర్చుల జాబితాను తీస్తే ఆ ఆదాయం ఎటు పోతుందో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాథమిక అవసరాలైన గూడు, తిండికే అమెరికాలో వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. మన దేశంలో ఒక సింగిల్ బెడ్రూమ్ ఇల్లు లేదా ఫ్లాట్ అద్దెకు తీసుకోవాలంటే నెలకు సగటున రూ.20 వేలు సరిపోతుండగా.. అమెరికాలో అదే గదికి ఏకంగా లక్ష రూపాయలు చెల్లించక తప్పని పరిస్థితి. అంటే ఇక్కడికంటే అద్దెకే ఐదింతలు ఎక్కువ సమర్పించుకోవాలన్నమాట.

**తిండి, రవాణా ఖర్చులు తడిసి మోపెడు**

ఇక అత్యంత కీలకమైన ఆహారం విషయానికి వస్తే వ్యత్యాసం మరీ స్పష్టంగా కనిపిస్తుంది. భారత్‌లో నెలకు ఒక వ్యక్తికి ఆహారం కోసం సుమారు రూ.7,500 ఖర్చు అవుతుండగా, అమెరికాలో ఆ ఖర్చు ఏకంగా రూ.40 వేలకు చేరుకుంటోంది. రవాణా ఖర్చులైతే మరీ భారంగా మారుతున్నాయి. మన వద్ద ప్రజా రవాణా లేదా వ్యక్తిగత ద్విచక్ర వాహనాల ఇంధనానికి నెలకు రూ.3 వేలు వెచ్చిస్తే సరిపోతుంది. కానీ, అమెరికాలో రవాణా వ్యవస్థల వినియోగం లేదా కారు నిర్వహణ కోసం ఏకంగా సగటున రూ.60 వేలు ఖర్చు చేయాల్సిందే. ఇక నిత్యావసరాలైన విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల కోసం భారత్‌లో నెలకు రూ.4 వేలు ఖర్చు అవుతుంటే, అమెరికాలో అక్షరాలా రూ.30 వేలు జేబులోంచి తీయాల్సిందే.

**విలాసమా.. పొదుపా.. తేల్చుకోవాల్సింది మీరే!**

ఈ గణాంకాలను బట్టి చూస్తే అమెరికాలో సగటు వేతనం మనకంటే సుమారు ఏడున్నర రెట్లు పైగా ఉన్నప్పటికీ.. ఖర్చులు కూడా దాదాపు అదే స్థాయిలో ఉంటున్నాయని స్పష్టమవుతోంది. మన దేశంలో సగటు వేతనం ఉన్నప్పటికీ, జీవన వ్యయం కూడా అందుబాటులోనే ఉండటం వల్ల ఆర్థిక స్థిరత్వం, పొదుపు చేసుకునే వెసులుబాటు లభిస్తోంది. అదే అమెరికాలో అధిక వేతనాలు అందుకుంటున్నప్పటికీ, నెలవారీ బిల్లులు, అద్దెలు, ఇతర అత్యవసర ఖర్చులకే ఆ ఆదాయంలో సింహభాగం హరించుకుపోతోంది. మొత్తంగా చెప్పాలంటే, డాలర్ల మోజులో అగ్రరాజ్యానికి వెళ్లే ముందు అక్కడ ఉండే ఖర్చుల మోతను కూడా కచ్చితంగా అంచనా వేసుకోవాలని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తోంది. ఆదాయం ఎక్కువే అయినా, దానికి తగినట్లుగా వ్యయం కూడా తడిసి మోపెడవుతుందన్న వాస్తవాన్ని అంగీకరించక తప్పదు.

## కాలి నడక కష్టాలకు చెక్



- ఆ ఊరిలో తొలిసారిగా రేషన్ పంపిణీ
- 45 కిలోమీటర్ల భారాన్ని తగ్గించిన యంత్రాంగం
- హితుల్ గ్రామంలో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు

**ఛత్తీస్గఢ్ , మహా:** స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. ఆ కుగ్రామానికి కనీస సదుపాయాలు మృగ్యమే. పూట గడవడానికి ప్రభుత్వమిచ్చే గుప్పెడు రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే అక్షరాలా 45 కిలోమీటర్లు అడవి దారిన కాలి నడకన వెళ్లాల్సిందే. తీరా అక్కడికి వెళ్లాక ఆ బియ్యం బస్తాలను తల మీద పెట్టుకుని అదే దారిలో అతి కష్టం మీద ఊరు చేరుకోవాలి. దశాబ్దాలుగా ఆ గిరిజనులు పడుతున్న ఈ కష్టాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. అధికారుల చొరవతో ఆ ఊరిలో చరిత్రలో మొట్టమొదటిసారిగా రేషన్ పంపిణీ జరిగింది. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత నారాయణపూర్ జిల్లా పరిధిలో జరిగిన ఈ అద్భుత ఘట్టం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

**అసలెక్కడ ఉందంటే..**

నారాయణపూర్ జిల్లాలోని అత్యంత దట్టమైన అటవీ ప్రాంతమైన అబుజ్‌మద్ (ఓర్చా) బ్లాక్‌లో ఘుల్ధులీ గ్రామ పంచాయతీ ఉంది. ఆ పంచాయతీ పరిధిలోకి వచ్చే ఒక మారుమూల కుగ్రామమే 'హితుల్'. మావోయిస్టులకు కంచుకోటగా భావించే ఈ ప్రాంతానికి చేరుకోవడమే అత్యంత కష్టంతో కూడుకున్న పని. కనీస రవాణా సదుపాయాలు లేని ఈ ఊరికి, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద రేషన్ బియ్యం అందించాలని జిల్లా యంత్రాంగం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అధికారుల చొరవతో పౌరసరఫరాల శాఖ సిబ్బంది ఆ ఊరికి నేరుగా వెళ్లి సరుకులు అందించారు.

**ఆ కష్టాలు వర్ణనాతీతం..**

ఇప్పటి వరకు హితుల్ గ్రామస్తులు తమ నెలవారీ రేషన్ తీసుకోవాలంటే ఓర్చా గ్రామం వరకు కాలి నడకన వెళ్లాల్సి వచ్చేది. రానుపోను సుమారు 45 కిలోమీటర్ల కఠినమైన అటవీ మార్గంలో ప్రయాణించడం వారికి నిత్యకృత్యంగా మారింది. ఎగుడు దిగుడుగా ఉండే దారిలో బియ్యం మూటను తలపై పెట్టుకుని రావడం గర్భిణులు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు నరకప్రాయంగా ఉండేది. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే ఘుల్ధులీ నుంచి ఓర్చా వెళ్లే మార్గం బురదమయమై పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో వాతావరణం అనుకూలించక గ్రామస్తులు తరచుగా తమ రేషన్‌ను సమయానికి తీసుకోలేక పస్తులుండే పరిస్థితులు కూడా తలెత్తేవి.

**ట్రాక్టర్‌లో నేరుగా ఊరికే..**

దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, జిల్లా అధికారులు ఒక ట్రాక్టర్ ద్వారా ఆహార ధాన్యాలను నేరుగా హితుల్ గ్రామానికే తీసుకువచ్చారు. రేషన్ బియ్యంతో పాటు నెయ్యి, ఉప్పు, పంచదార, శనగలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తమ సొంత ఊరిలో, తమ కళ్ల ముందే రేషన్ పంపిణీ జరుగుతుండటం చూసి గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమ విలువైన సమయంతో పాటు, శారీరక శ్రమ, డబ్బును ఆదా చేసిన జిల్లా యంత్రాంగానికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**కొత్త జీవితానికి నాంది..**

హితుల్ వంటి అత్యంత మారుమూల ప్రాంతాలకు ట్రాక్టర్లను ఉపయోగించి ఆహార ధాన్యాలను రవాణా చేశామని జిల్లా ఆహార అధికారి అలావుద్దీన్ ఖాన్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సరికొత్త విధానం ద్వారా ఇకపై ప్రతి నెలా రేషన్ క్రమం తప్పకుండా గ్రామస్తులకు వారి ఊరిలోనే అందుతుందని ఆయన స్పష్టం చేశారు. దీనివల్ల హితుల్ గ్రామంలో ఉన్న 271 మంది రేషన్ కార్డుదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. అబుజ్‌మద్ లాంటి దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమం, గిరిజనుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చొరవ వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపిందని కొనియాడుతున్నారు.

## భూదానోద్యమ స్ఫూర్తి పునరుద్ధరణ



**వెదిరే, మహా:** అహింసా మార్గంలో భూ సమస్యలను పరిష్కరించవచ్చని ఆచార్య వినోబా భావే ప్రపంచానికి చాటిచెప్పిన ఈ ఉద్యమ పురిటిగడ్డ భూదాన్ పోచంపల్లి. శనివారం ఇక్కడ జరిగిన వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఒక పవిత్ర స్మృతిగా మిగిలిపోతుంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని భూదాన స్ఫూర్తిని కొనియాడారు. వెదిరే రామచంద్రారెడ్డి వినోబా భావే పిలుపు అందుకొని తన వందలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టడం అప్పట్లో ఒక పెను సంచలనం. ఆ త్యాగమే నేడు పోచంపల్లికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. మహేష్ కుమార్ గౌడ్ తన ప్రసంగంలో తన కుటుంబానికి ఈ ఉద్యమంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన తాత గతంలో 50 ఎకరాలు దానం చేశారని, ఆ వారసత్వాన్ని తాము కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇటీవల తన సొంత గ్రామంలో పాఠశాల, సబ్ స్టేషన్ నిర్మాణానికి 11 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చామని చెప్పడం ద్వారా భూదాన స్ఫూర్తి ఇప్పటికీ సజీవంగా ఉందని ఆయన నిరూపించారు. రాజకీయాల్లో పదవుల కంటే ప్రజాసేవ, త్యాగం మిన్న అని ఆయన ఉద్ఘాటించారు. భూమి లేని పేదలకు ఆత్మగౌరవాన్ని అందించిన ఈ ఉద్యమం నేటి తరానికి ఆదర్శం కావాలి. అప్పట్లో వినోబా భావే వేసిన అడుగులు దేశవ్యాప్తంగా భూ సంస్కరణలకు పునాది పడటమే కాకుండా గ్రామ స్వరాజ్య సాధనకు బాటలు వేశాయి. వెదిరే రామచంద్రారెడ్డి చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఈ స్థాయి గౌరవం కల్పించడం అభినందనీయం. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి చాటుకుంది. భూదాన స్ఫూర్తి చిరస్థాయిగా నిలవాలని, భావితరాలు ఈ చారిత్రక త్యాగాలను స్మరించుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.



## కోల్పోయినవారికే విలువ తెలుస్తుంది

### రెజీనా

జీవితంలో ప్రతి ఒక్కరికీ ప్రతి సంఘటన ఒక అనుభవమే. అలాంటి అనుభవాలు చాలా పాఠాలు నేర్పుతాయి. కోల్పోయిన వాటి విలువలను తెలియ జేస్తాయి. ఒక చిత్ర పరిశ్రమ విషయానికి వస్తే ఇక్కడ చాలా కథలు వెలుగు చూస్తాయి. అలాంటి పలు అనుభవాలను కలిగిన నటీమణుల్లో రెజీనా ఒకరు. అచ్చ తమిళ అమ్మాయి–2005 కండనాళ్ మొదల్ చిత్రం ద్వారా నటిగా పరిచయం అయ్యారు. తెలుగులో SMS చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చారు. అయితే, కోలీవుడ్‌లో తొలి చిత్రంతోనే మంచి గుర్తింపును పొందన రెజీనా ఆ తరువాత తమిళంతో పాటు, తెలుగు, కన్నడం, హిందీ తదితర భాషల్లో నటిస్తూ తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాందించుకున్నారు. ముఖ్యంగా తెలుగులో స్టార్ హీరోయిన్‌గా రాణించారు. అయితే కథానాయకిగానే కాకుండా నటనకు అవకాశం ఉంటే ప్రతినాయకిగానూ నటిస్తూ తన సత్తా చాటుతున్నారు. 35 ఏళ్ల ఈ భామ ఇప్పటికీ అవివాహితే. ఈమె ఇటీవల తన ఇన్‌స్టాలో ప్రేమ గురించి తెలిపారు. 'ఒక రోజే నేను ప్రేమకు సరెండర్ అయ్యాను. ప్రతి ఒక్కరి జీవితంలో జరిగేది జరగడం ఆగిపోదు కానీ, దానిని కొందరు బలహీనంగా భావిస్తున్నారు. అయితే ప్రేమ అనేది ఒక ప్రశాంతతో కూడిన బలం. ప్రతిరోజు మీ కోసం మీరు చిరునవ్వుతో లేచి నిలబడాలి. మీరు ప్రేమను అందించడానికి అర్హులు అనేది ఎప్పుడూ గుర్తుంచుకోండి. దాన్ని సాధారణంగా భావించరాదు. ప్రేమించడంలోనూ, ప్రేమించబడడంలోనూ ఉండే సంతోషం మనకు తెలియడానికి కారణం, దాన్ని కోల్పోవడంలోఉండే బాధ మనకు తెలుసు అన్నదే' అని నటి రెజీనా పేర్కొన్నారు. ఈమె పోస్ట్‌కు కారణం ఏమిటి, స్వానుభవమా? అంటూ నెటిజన్లు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం నటి రెజీనా ఫ్లాష్‌బ్యాక్, మూక్కుత్తి అమ్మన్–2, ది వైవ్స్, హిందీలో సెక్షన్ 108 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

## వ్యసనం.. ఓ మానసిక రోగం




ఏ వ్యసనమైనా విలాసం కాదనీ, అది ఓ మానసిక రోగమని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. షూటింగ్‌లతో ఎప్పడూ బిజీగా ఉండే జాన్వీ.. సామాజిక అంశాలపైనా బాధ్యతతో వ్యవహరిస్తుంటుంది. మద్యపానం, దాని వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తుంటుంది. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి.. మద్యపానంపై ఓ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నది. ఈ సందర్భంగా మద్యపానం, దాని వల్ల కలిగే ఇబ్బందుల గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. "మద్యానికి బానిసలైన వ్యక్తులను, వారి వ్యక్తిత్వాన్ని ఎవరూ తక్కువ చేయొద్దు. నిజానికి మద్యపానంతో పాటు ఏ వ్యసనమైనా.. చెడు అలవాటు కాదు. ఒక మానసిక సమస్య మాత్రమే. ఒత్తిడి, బాధలు, వ్యక్తిగత సమస్యల వల్లే చాలామంది వాటికి అలవాటు పడతారు. అలాంటివారిని నేరస్తుల్లా కాకుండా.. రోగుల్లా చూడాలి. వారిని విమర్శించడం, దూరంగా ఉంచడం వంటివి చేయొద్దు. వారికి ప్రేమను పంచాలి. తోటివారి నుంచి సానుభూతి, మద్దతు లభిస్తేనే అలాంటి వారు త్వరగా మారతారు" అంటూ చెప్పకొచ్చింది జాన్వీ. మద్యపానం తన జీవితంపైనా ప్రభావం చూపిందని వెల్లడించింది. "నేను కూడా అప్పడప్పడూ మద్యం తీసుకునేదాణ్ని. కానీ, కొన్నిరోజులకు నాకు తెలియకుండానే దానికి బానిసగా మారిపోయా! వ్యసనం అంటే మనతో ఎవరో అపరిచిత వ్యక్తి ఉనట్టే అనిపిస్తుంది. మన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వచ్చేది. ఈ అలవాటు గురించి గతంలో నేనెప్పడూ మాట్లాడలేదు. కానీ, నా చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడటం చూసిన తర్వాత, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని అర్థమైంది. ఈ వ్యసనం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోతామనీ, ఎంతో నష్టపోతామని తెలిసిన తర్వాత.. ఏం చేయాలనే దానిపై అవగాహన వచ్చింది" అంటూ చెప్పకొచ్చింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. దేవర చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది జాన్వీ. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్దిలో నటిస్తున్నది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానున్నది.

## దీపిక సరికొత్త వ్యూహం



బాలీవుడ్ అగ్రతార దీపిక పదుకోణ్ తన కెరీర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇకనుంచి యంగ్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ద్వారా తన ఇమేజ్‌ని రీ డిజైన్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నది ఈ అందాలభామ. కొత్త ఆడియన్స్‌ని ఆకర్షించేందుకే దీపికా ఈ స్ట్రాటజీని ఫాలో అవుతున్నదని బాలీవుడ్ మీడియా కోడై కూస్తున్నది. ఇందులో భాగంగా ఆమె బడ్జెట్ గురించి, బ్యానర్ గురించి ఆలోచించకుండా కేవలం పాత్రలకే ప్రాధాన్యతనిస్తూ కథలు వింటున్నదట. మరోవైపు మహిళా ప్రాధాన్యత ఉన్న పాత్రల వైపు కూడా దీపిక మొగ్గు చూపుతున్నదని బీటౌన్ టాక్. అలాగే.. తన భర్త రణ్‌వీర్‌సింగ్ నటిస్తూ నిర్మిస్తున్న జాంబి యాక్షన్ థ్రిల్లర్ 'ప్రళయ్' చిత్రంలో నటించేందుకు కూడా దీపిక ఆసక్తి చూపిస్తున్నదట. సొంత సినిమా కావడంతో పారితోషికం కూడా వద్దనుకుందట. కొత్త జానర్స్‌పై ఆసక్తి చూపడంలో భాగమే ఇదంతా అని ఆ చిత్ర మేకర్స్ అంటున్నారు. మొత్తంగా ఓవర్ స్కిన్‌షోకు దూరంగా, క్వాలిటీకి దగ్గరగా ఉండాలని దీపిక ఫిక్సయినట్లు తెలిసింది.

## అడక్కుండానే.. అనుకోని వరం!



**ఉప్పెనతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన క్యూట్ గర్ల్ కృతి శెట్టి... వరుస సినిమాలు చేస్తున్నా విజయాలు మాత్రం ఆమెను వరించడంలేదు. శ్యాం సింగరాయ్, బంగార్రాజు లాంటి హిట్లు పడ్డప్పటికీ ఆ తరువాత చెప్పకోదగ్గ సినిమాలేవీ ఆడలేదు. అయినా కూడా వరుస ఆఫర్లు అందుకుంటున్నది. తాజాగా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్‌తో జతకట్టి థియేటర్లలో సందడి చేస్తున్నది కృతి. ఈ సందర్భంగా బేబమ్మ పంచుకున్న కార్‌వాన్ కబుర్లు..**

కర్ణాటకలోని మంగళూరు మా స్వస్థలం. కానీ, పెరిగిందంతా ముంబయిలోనే. మా నాన్న వ్యాపారవేత్త, అమ్మ ఫ్యాషన్ డిజైనర్. అమ్మ చేసే పనివల్లే నాకు మాడలింగ్‌పై ఆసక్తి కలిగింది. చిన్నతనంలోనే పలు బ్రాండ్ యాడ్స్‌లో నటించాను. ఆ తరువాత చైల్డ్ ఆర్టిస్ట్‌గా హిందీ చిత్రం సూపర్ 30లో చిన్నపాత్రలో నటించాను. కొన్నాళ్లకు 'ఉప్పెన' సినిమాతో నా సినీ ప్రయాణం మొదలైంది.

టాలీవుడ్‌లో అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వచ్చిన సినిమాలన్నీ ఇప్పటివరకు బ్లాక్ బాస్టర్సే. అన్ని సినిమాల్లో కావాల్సినంత కామెడీ దొరుకుతుంది. ఆయన సినిమాల్లో నటించాలనే కోరిక చాలా రోజుల నుంచి ఉంది. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ఆయన అడక్కుండానే నాకు వరం ఇచ్చేశారు. ఆయన చేస్తున్న ప్రస్తుత సినిమాలో అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

నేను ఇప్పటికీ ఆత్మలు ఉన్నాయని నమ్ముతాను. మాది తుళు. మేము మా పూర్వికులను దేవతలుగా పూజిస్తాం. వాళ్లు మమ్మల్ని ఎప్పడూ కాపాడుతారని విశ్వసిస్తాం. కార్తీ వా వాతియర్ (అన్నగారు వస్తారు) షూటింగ్ ప్రారంభానికి ముందురోజు రాత్రి మా అమ్మతో కలిసి ఓ హోటల్ గదిలో ఉన్నాను. అప్పడు అక్కడే ఓ ఆత్మను చూశాను. మేం లైట్ వేయగానే పెద్ద సౌండ్ వచ్చింది. ఆ తర్వాత ఆత్మ కనిపించలేదు.

ఒకసారి ఓ కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకు వెళ్లాను. అది పూర్తయ్యాక, తీసుకెళ్లడానికి నాన్న వస్తానన్నారని ఎదురుచూస్తున్నాను. ఇంతలో తనకు ఆలస్యమవుతుందని నాన్న ఫోన్ చేసి చెప్పారు. ఆ గ్యాప్‌లో పక్కనే ఉన్న స్టూడియోలోకి సరదాగా వెళ్లాను. అక్కడ ఒక సినిమా కోసం ఆడిషన్లు జరుగుతున్నాయి. నన్ను చూసిన యూనిట్ సభ్యులు 'సినిమాల్లో నటించే ఆసక్తి ఉందా?' అని అడిగేశారు. నాకేం చెప్పాలో తోచలేదు. 'ఆలోచించి చెబుతాన'ని మా అమ్మ ఫోన్ నెంబర్ ఇచ్చి ఇంటికొచ్చాను. వెంటనే మా అమ్మకు ఫోన్ చేసి ఉప్పెన సినిమా గురించి చెప్పారట. ఆమె సమ్మతించడంతో నేనూ ఓకే చెప్పేశా.

లవ్ ఇన్సురెన్స్ కంపెనీలో నా పాత్ర మిమ్మల్ని మీరు చూసుకున్నట్లే ఉంటుంది. ఒక్క లైక్ ఒక షేర్ అంటూ సెల్‌ఫోన్ పిచ్చితో పెరిగిన అమ్మాయిగా ధీమా పాత్రలో నటించాను. ఈ జెనరేషన్‌కు ఇట్టే కనెక్ట్ అవుతుంది. ప్రదీప్ రంగనాథన్ కసి ఉన్న యాక్టర్. కొత్తగా ఆలోచిస్తుంటాడు. షూటింగ్ అయిపోయాక కూడా రేపటి షెడ్యూల్ ముందే ప్లానింగ్ చేసుకుంటాడు. ఆయనతో కలిసి నటించడం వల్ల చాలా నేర్చుకున్నాను.

సోషల్ మీడియాలో ఏఐ సృష్టిస్తున్న అలజడి అంతా ఇంతా కాదు. ఇటీవల ఒక వ్యక్తితో నేను సన్నిహితంగా ఉన్నట్లు ఫేక్ ఫొటో ఒకటి వైరలైంది. అది చూసి మా అమ్మ ఆందోళనకు గురైంది. సెలెబ్రిటీలకే ఇలాంటి పరిస్థితి ఉంటే, సామాన్య మహిళల భద్రత గురించి ఆలోచిస్తేనే భయంగా ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com